పల్లె పోరుకు కసరత్తు



- ఓటరు జాబితా రూపకల్పనకు ఆదేశాలు
- 15వ తేదీ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్?
- జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణ
- రిజర్వేషన్లపై గ్రామాల్లో చర్చోపచర్చలు

శిక్షణ కోసం హైదరాబాద్‌కు ప్రత్యేక అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 2: పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం ఆ దిశగా సన్నాహాలు ప్రారంభించింది. అందులో భాగంగా వార్డుల వారీగా మ్యాపింగ్, ఓటరు జాబితా తయారీపై కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారులు ఐదుగురిని ఎంపిక చేసి శుక్రవారం హైదరాబాద్ పంపించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఇద్దరు, ఎంపీవోలు ఇద్దరు, మరో డీపీఎం (జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్) ఈ శిక్షణకు వెళ్లారు. దీంతో పల్లెపోరుపై అధికారికంగా కసరత్తు ప్రారంభమైనట్లయ్యింది. ఈ నేపథ్యంలో సర్పంచ్ పదవికి పోటీచేయాలని భావిస్తున్న రాజకీయ నాయకుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

రిజర్వేషన్లపై పల్లెల్లో చర్చ

ప్రస్తుతం పల్లెల్లో ఎక్కడ చూసినా పంచాయతీ ఎన్నికలపైనే చర్చ జరుగుతోంది. ఖమ్మం జిల్లాలో 589 పంచాయతీలు, 5,398 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆగస్టు 15 తర్వాత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మొదటి వారంలో ఓటరు జాబితా సిద్ధం చేయాలని పంచాయతీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో నిర్వహించిన రిజర్వేషన్ల ఆధారంగానే ఎన్నికలను నిర్వహించనున్నట్టు అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 589 పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలను నిర్వహించనున్నారు. మొదటి విడతగా 6 మండలాల్లో, రెండో విడతలో 7, మూడో విడతలో మరో 7 మండలాల్లో ఎన్నికలను నిర్వహించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఎన్నికల ప్రక్రియకు చకచకా ఏర్పాట్లు జరిగిపోతుండడంతో గ్రామాల్లో రిజర్వేషన్లపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. అయితే పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తారా? లేక కొత్తగా ఖరాలు చేస్తారా? అనే విషయంపై ఇంకా సర్కార్ నుంచి స్పష్టత రాలేదు. అధికారులు మాత్రం ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

టీ-పోల్ వెబ్‌సైట్ ఆధారంగానే..

సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవుల వివరాలతో పాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బంది వివరాలు పంపించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఆ దిశగా పంచాయతీ అధికారులు వివరాలను సేకరిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది వివరాల ఆధారంగా వాటిని ఇప్పటికే టీ-పోల్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. గ్రామీణ మండలాల్లోని 589పల్లెల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించడానికి నివేదికలు రూపొందిస్తున్నారు. మొదటి విడతలో ఆరు, రెండో విడతలో 7, మూడో విడతలో మరో 7 మండలాల చొప్పున ఎన్నికలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈసారి ఖమ్మం జిల్లాలో విలీన పంచాయతీలు 5 కలిపి మొత్తం 589 పంచాయతీలకు ఎన్నికలను నిర్వహించనున్నారు. 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. 200 మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్, ఒక పోలింగ్ ఆఫీసర్ ఉంటారు. 201 నుంచి 400 మంది ఓటర్లు ఉండే చోట ఒక ప్రిసైడింగ్, ఇద్దరు పోలింగ్ అధికారులు ఉంటారు. 401 నుంచి 650 మంది ఉండే దగ్గర ఒక ప్రిసైడింగ్ అధికారి ముగ్గురు పోలింగ్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. ఓ వైపు గ్రామాల్లో సర్పంచ్ పదవులకు పోటీచేసే ఆశావహుల సందడి కనిపిస్తుండగా మరో వైపు అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణ పనుల్లో నిమగ్నమయ్యారు.



కొత్తగా నిర్మించబోతున్న మెడికల్ కళాశాల భవన డిజైన్‌ను హైదరాబాద్‌లో పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం మెడికల్ కళాశాలకు స్థలం కేటాయింపు

- రఘునాథపాలెం వద్ద 35 ఎకరాలకు కేబినెట్ ఆమోదం
- త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం

ఖమ్మం, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు త్వరలో అధునాతన భవనాలు రాబోతున్నాయి. కొత్త మెడికల్ కళాశాల నిర్మాణానికి రాష్ట్ర కేబినెట్‌లో 35 ఎకరాల భూమి కేటాయించడంతో భవనాల పనులు ప్రారంభానికి సన్నాహాలు సాగుతున్నాయి కొత్త మెడికల్ కళాశాలకు సూపర్‌స్పెషాలిటీ మోడల్‌లో అధునాతన భవనాల డిజైన్ కూడా ఆకర్షణీయంగా రూపొందించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధతో కొత్త మెడికల్ కళాశాలలో సూపర్‌స్పెషాలిటీ స్థాయిలో వైద్యసేవలందేలా భవనాల నిర్మాణం చేపట్టాలని అన్ని విభాగాలు అందుబాటులో ఉండేలా సౌకర్యాలు సమకూర్చేలా రూపకల్పన చేయాలని గతంలో ఆర్‌అండ్‌బీ, వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రొఫెసర్లు, సిబ్బందికి క్వార్టర్లతోపాటు విద్యార్థుల వసతి సముదాయంతోపాటు అన్నిరకాల వైద్య సేవలు ఒకేచోట అందేలా భవనాల రూపకల్పన చేస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతో రఘునాథపాలెం బైపాస్‌రోడ్డులో కొత్తమెడికల్ కళాశాల నిర్మాణానికి అవసరమైన 35 ఎకరాల స్థలం గుర్తించడం, ప్రభుత్వానికి ప్రతిపాదనల వెళ్లడం, ఆ వెంటనే కేబినెట్‌లో ఆమోదం పొందడంతో త్వరలోనే భవనాల పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రస్తుతం ఖమ్మం మెడికల్ కళాశాలను పాత కలెక్టరేట్‌లో తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఖమ్మం ఎమ్మెల్యేగా తుమ్మల నాగేశ్వరరావు గెలిచిన తర్వాత ఆయన వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఖమ్మం మెడికల్ కాలేజీని ఒక మోడల్ కళాశాలగా నిర్మించేందుకు ప్రతిపాదనలు చేయించారు. ప్రస్తుతం ఉన్న పాత కలెక్టరేట్‌తో పాటు ఇతర భవనాలను జిల్లాకు సంబంధించి ఇతర ప్రభుత్వ అవసరాలకోసం వినియోగించేలా రూపకల్పన చేశారు. దీంతో కొత్త మెడికల్ కాలేజీకి శాశ్వత భవనాలు రాబోతున్నాయి. రఘునాథపాలెం సమీపంలో 35 ఎకరాల భూమి కేటాయించినందున ముఖ్యమంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో వైద్యకళాశాల పనులు ప్రారంభం కాబోతున్నాయని, వైద్యకళాశాలకు అనుబంధంగా ప్రభుత్వ ఆసుపత్రి, వైద్యవిద్యార్థుల బోధన, బోధనేతర సిబ్బందికి వసతి గృహాలు ఏర్పాటు కానున్నాయని తెలిపాపరు. అన్నిప్రాంతాలకు రాకపోకలు సౌలభ్యంగా ఉండేలా స్థలం ఎంపికచేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు.



ఖమ్మం మెడికల్ కళాశాల భవన నమూనా



నేడు జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

చింతకానిలో 'దళితబంధు'పై సమీక్ష

చింతకాని, ఆగస్టు 2: చింతకాని మండలంలో నేడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటించనున్నారు. ఈ సందర్భంగా 'దళితబంధు'పై అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. దళితబంధు పథకం అమలు తీరు, లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులు తదితర విషయాలపై ఆయన సమీక్షించనున్నారు. ఈ సమీక్ష జరిగే రైతువేదికను వైరా సీఐ సాగర్, తహసీల్దార్ కే.అనంతరాజు, ఎంపీడీవో రామయ్య, ఎంపీవో రవీంద్రప్రసాద్, ఎస్ఐ నాగుల్‌మీరా, ఎంపీపీ పూర్ణయ్య, నాయకులు కన్నెబోయిన గోపి గురువారం పరిశీలించారు.

ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం అమలు చేయాలి

ఖమ్మం మాజీ ఎంపీ నామా

ఖమ్మంటౌన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ఆ తీర్పును వెంటనే అమలు చేయాలని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 2014, నవంబర్ 29న అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రప్రభుత్వానికి పంపారని నామా పేర్కొన్నారు. కేంద్రం దానికి స్పందించకపోవటంతో తాను ఎంపీగా ఉన్నప్పుడు పలుమార్లు లోక్‌సభలో ఇదే విషయాన్ని ప్రస్తావించానన్నారు. అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని లోక్‌సభలో చర్చించాలని బీఆర్ఎస్ తరఫున వాయిదా తీర్మానం ఇస్తే తిరస్కరించారని నామా పేర్కొన్నారు. దీంతో సహచర ఎంపీలతో కలిసి పార్లమెంట్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాలాయాపన చేయకుండా ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు.



ఇంద్రకీలాద్రిలో దుర్గమ్మకు సారె సమర్పించేందుకు వెళ్తున్న దేవస్థానం ఈవో

కనకదుర్గమ్మకు రామయ్య సారె

సమర్పించిన భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి

భద్రాచలం, ఆగస్టు 2: విజయవాడలో ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి శుక్రవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం తరఫున ఈవో ఎల్.రమాదేవి సారెను సమర్పించారు. భద్రాద్రి దేవస్థానం ఈవో, అధికారులు రామయ్య సారెతో వెళ్లగా వారికి దుర్గగుడి దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భద్రాద్రి దేవస్థానం తరఫున ఈవో సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఇంద్రకీలాద్రి ఆలయ వేద పండితులు భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవికి వేదాశీర్వచనం అందజేశారు. దుర్గగుడి దేవస్థానం ఈవో కేఎస్ రామారావు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఈవో వెంట భద్రాద్రి దేవస్థానం పర్యవేక్షకులు నిరంజన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ రత్నం శ్రీకాంత్ పాల్గొన్నారు.

జియో థర్మల్ ప్రాజెక్ట్ ఏర్పాటుపై

త్రైపాక్షిక ఒప్పందం

- సంతకాలు చేసిన సింగరేణి సీఎండీ
- దేశంలోనే అతిపెద్ద జియోథర్మల్ కేంద్రం కానున్న మణుగూరు
- ప్రయోగాత్మకంగా 20కేవీ విద్యుదుత్పాదన విజయవంతం

మణుగూరు, ఆగస్టు 2: రాష్ట్రంలోని భద్రాద్రికొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో 122 మెగావాట్ల జియోథర్మల్ పవర్‌స్టేషన్ నెలకొల్పేందుకు శుక్రవారం ఒప్పందాలు జరిగాయి. సింగరేణి సంస్థతో పాటు ఓఎన్‌జీసీ, తెలంగాణ రిన్యూవబుల్ ఎనర్జీ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కలిసి త్రైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేశారు. తొలుత మణుగూరులో ప్రయోగాత్మకంగా జియోథర్మల్ పవర్‌స్టేషన్‌ను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సింగరేణి సంస్థల సంయుక్త సహకారంతో పగిడేరు పంచాయతీలోని ఎస్టీ కాలనీ సమీపంలో ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడంతో మరో అడుగు ముందుకు వేస్తూ త్రైపాక్షిక సమావేశంలో చరిత్రాకత్మక నిర్ణయాలు తీసుకుని ఒప్పందాలు జరిగాయి. దీంతో దేశంలోనే అతిపెద్ద జియోథర్మల్ పవర్‌స్టేషన్‌ను మణుగూరులో ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం అవుతోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సింగరేణి చైర్మన్ ఎండీ ఎన్ బలరామ్, ఓఎన్‌జీసీ డైరెక్టర్ ఎక్స్‌ప్లోరేషన్ సుస్మారావత్, తెలంగాణరెడ్కో జీఎం సత్యవర ప్రసాద్‌లు శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అంశంపై నిర్ణయం తీసుకుని ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ బలరాం మాట్లాడుతూ మణుగూరులో 122 మెగావాట్ల జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉందని జియోజికల్ సర్వేఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించిందన్నారు. సింగరేణి పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం దిశగా ముందుకు వెళుతోందని తెలిపారు. ఇప్పుడు అన్ని సంస్థలు కూడా వ్యాపార విస్తరణల్లో భాగంగా ఇతర సంస్థలతో కలసి పనిచేస్తూ ముందుకు వెలుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే మణుగూరులో జియోథర్మల్ విద్యుత్ కేంద్ర ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఓఎన్‌జీసీ డైరెక్టర్ సుస్మారావత్ మాట్లాడుతూ దేశంలోని అతిపెద్ద జియోథర్మల్ క్షేత్రంగా మణుగూరు మారనుందని తెలిపారు. ఇక్కడ ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉందని, మరింత అన్వేషణ జరిగితే జియోథర్మల్ విద్యుత్ ఉత్పత్తే కాకుండా హీలియం వెలికితీసేందుకు అవకశాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే సింగరేణి, తెలంగాణ రెడ్కో సహకారంతో క్షేత్రస్థాయిలో సర్వేలు చేసినట్లు తెలిపారు. తెలంగాణ రెడ్కో జీఎం సత్యవరప్రసాద్ మాట్లాడుతూ, క్లీన్ ఎనర్జీ ప్రోత్సాహం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంస్థలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. మణుగూరులో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే దేశంలోనే తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. ఒప్పందం ప్రకారం ప్రతిపాదిత గోదావరి జియో థర్మల్‌ఎనర్జీ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వ మహారత్న సంస్థ అయిన ఓఎన్‌జీసీ వారు మణుగూరు ప్రాంతంలో జియో థర్మల్ విస్తరించి ఉన్న భూ అంతర్భాగంలో అన్వేషణలు జరపడంతో పాటు ఇంకా జియో థర్మల్‌పవర్ స్టేషన్ల ఏర్పాటుకు గల అవకాశాలను అధ్యయనం చేసి నివేదికను సమర్పిస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర అటవీశాఖ సహకారం కోరుతూ ఒక ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. సింగరేణి సంస్థ లాజిస్టికల్ సహకారం అందిస్తుందన్నారు. మణుగూరులో ఇప్పటికే భూగర్భం నుంచి ఉబికి వచ్చే వేడి నీటితో విద్యుత్ ఉత్పాదన కోసం కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారంతో 20 కిలోవాట్ల విద్యుత్‌ప్లాంట్ ఏర్పాటును సింగరేణి ప్రయోగాత్మకంగా విజయవంతం చేసి చూపింది. దీంతో నూతన ప్రాజెక్టు ఏర్పాటుకు మార్గం సిద్ధమైంది. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ ఈఅండ్‌ఎండి సత్యనారాయణరావు, డైరెక్టర్ ఆపరేషన్స్, పర్సనల్ ఎన్‌వికె శ్రీనివాస్, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు జీ వెంకటేశ్వరరెడ్డి, జీఎం ఆర్‌అండ్‌డి ఎస్‌డీఎం సుభానీ, జీఎం కో-ఆర్డినేషన్ జీ దేవేందర్, ఓఎన్‌జీసీ తరుపున సంస్థ జీజీఎం గోపాల్ జోషి, జీఎం సంజయ్‌కుమార్ ముఖర్జీ, చీఫ్ మేనేజర్ రమేష్ సాట్ల, అనూప్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



త్రైపాక్షిక సమావేశంలో పాల్గొన్న ఉన్నతాధికారులు

పూసుగూడెంలో సీతారామ

పంప్‌హౌస్-2 ట్రయల్‌రన్

ఒక మోటార్‌నుంచి విజయవంతంగా నీటి పంపింగ్



ములకలపల్లి, ఆగస్టు 2: భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెంలోని వికే రామవరం వద్ద సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్-2లో నీటిపారుదలశాఖ అధికారుల బుధవారం అర్ధరాత్రి ట్రయల్‌రన్ నిర్వహించారు. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్-1 నుంచి వచ్చిన గోదావరి జలాలలను పంప్‌హౌస్-2 నుంచి ఎత్తిపోశారు. ఈ పంప్‌హౌస్‌లో ఆరు మోటర్లు ఉండగా ఒక్కొక్క మోటర్ 1,500 క్యూసెక్‌ల నీటిని పంపింగ్ చేసే సామర్థ్యం కలిగి ఉన్నాయి. అయితే బుధవారం అర్ధరాత్రి ఒక మోటర్ వెట్‌రన్ నిర్వహించగా విజయవంతంగా గోదావరి జలాలలను ఎత్తిపోసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జపాన్‌కు చెందిన టెక్నిషియన్లు, వీరితోపాటు చైనా అనుబంధ కంపెనీ నిపుణులు, నీటిపారుదలశాఖ సలహాదారు పెంటారెడ్డి, ఎస్.ఈ శ్రీనివాస్, ఈఈ సురేష్‌కుమార్, డీఈ మోతీలాల్, ఏఈ గఫూర్ పాల్గొన్నారు.

నిధులిస్తేనే వెలుగు

- కార్పొరేషన్ కార్యాలయంలో అసంపూర్తిగా సోలార్‌విద్యుత్
- 130కిలోవాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి కార్యాచరణ
- ఇప్పటికి 100కిట్లవాట్ల మేర నిర్మాణం పూర్తి
- నిధులు లేకపోవడంతో 30కిలోవాట్లు మూలకు
- పూర్తయితే ఏడాదికి రూ.20లక్షల కరెంట్‌బిల్లు ఆదా



ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 2: ఖమ్మం నగర పాలక కార్యాలయంలో వందశాతం సోలార్ ఎనర్జీ వినియోగం ప్రయత్నం అసంపూర్తిగా మిగిలింది. సోలార్ విద్యుత్ వినియోగ ప్రయత్నం మంచిదే అయినా దాన్ని అమలుపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క నిమిషం విద్యుత్ పోతేనే ఎన్నో అవాంతరాలు ఎదురవుతాయి. ఇక ప్రభుత్వ కార్యాలయాల సంగతి చెప్పాల్సిన పనిలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పెరిగిన విద్యుత్ అవసరాల దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సౌర విద్యుత్‌ను విరివిగా వాడకంలోకి తీసుకొచ్చాయి. ఇందుకోసం టీఎస్ 'రెడ్‌కో' సంస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ, ప్రైవేట్ అవసరాలకు సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసి అందిస్తున్నారు. ఈ క్రమంలోనే ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో విద్యుత్ అవసరాలను తీర్చేందుకు 130కిలో వాట్ల సౌర విద్యుత్ అవసరం ఉంటుందని కేఎంసీ అధికారుల ఆదేశాల మేరకు టీఎస్ రెడ్‌కో సంస్థ ఆధ్వర్యంలో అంచనాలు పూర్తి చేసి నిర్మాణం ప్రారంభించారు. మొదటి విడతగా రూ.58,27,174 వ్యయంతో ఏడాది క్రితం 100 కిలోవాట్ల సామార్థ్యంతో తొలి సౌరవిద్యుత్ ఉత్పత్తి పలకాలు, పరికరాలను నిర్మించారు. 100కిలోవాట్ల సౌర విద్యుత్ అందుబాటులోకి రావటంతో రోజుకు 400యూనిట్లు సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఇందులో ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయాల అవసరాలకు కొంతమేర వినియోగిస్తున్నారు. ఇలా రోజుకు 4వేల యూనిట్స్, నెలకు 12వేల యూనిట్స్, ఏడాదికి 1,44,000 యూనిట్స్ చొప్పున సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగం జరుగుతోంది. సరాసరిగా ఒక్కో యూనిట్‌కు రూ.8.8 ధర చొప్పున లెక్కించినా ఏడాదికి కేఎంసీపై రూ.12,67,200 వరకు విద్యుత్ భారం తగ్గింది. ఇలా ఐదేళ్లపాటు సౌర విద్యుత్ వినియోగం ద్వారా కేఎంసీ కార్యాలయంలో సౌర విద్యుత్ నిర్మాణం కోసం పెట్టిన వ్యయం రూ.59లక్షలు విద్యుత్ భారం తగ్గటం ద్వారా తిరిగి ఆదాయ రూపంలో మిగులుతుంది. ఐదేళ్ల తర్వాత ఉచితంగా సౌర విద్యుత్ అందనుంది.

సగం సౌర విద్యుత్‌తో సరేనా..

ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయాల అవసరాల మేరకు మొత్తం 130కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగాల్సి ఉండగా మరో 30కిలోవాట్స్ పనులు సగంలోనే నిలిచిపోయాయి. ఇందులో రూ.24,47,650 నిధులు అవసరం ఉంటుంది. 30కిలోవాట్స్ ద్వారా రోజుకు 120యూనిట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి లభిస్తుంది. దీంతో ఏడాదికి 43,200 యూనిట్లు సౌర విద్యుత్ వినియోగం జరిగి సాధారణ విద్యుత్ భారం తగ్గనుంది. కానీ ఏడాదిగా ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి నిధులు కేటాయించకపోవటంతో సౌర విద్యుత్ సగంలోనే నిలిచిపోయింది. యూనిట్‌కు రూ.18 చెల్లించి అధిక యూనిట్ ఛార్జీలతో సాధారణ విద్యుత్ కొనుగోలుకు ప్రతీ నెల రూ.లక్షల విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్న పాలకవర్గం సౌర విద్యుత్‌ను మాత్రం పూర్తిస్థాయిలో గుర్తించటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈనెల 5న జరిగే ఖమ్మం నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశంలోనైనా పెండింగ్‌లో ఉన్న 30కిలోవాట్స్ విద్యుత్ ఉత్పత్తికి నిధులు కేటాయిస్తే కేఎంసీలో విద్యుత్ అవసరాలకు సౌర విద్యుత్ అందుబాటులోకి రావడంతో పాటు ఆర్థికంగా ఏడాదికి రూ.20లక్షల విద్యుత్ భారం తగ్గనుంది.

అంకితభావంతో పనిచేయండి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్
- ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీలు
- తరగతి గదులు, టాయిలెట్లు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం



సారపాకలో 247 కేజీల

గంజాయి పట్టివేత


6

- ఆరుగురి అరెస్టు.. మూడు కార్లు స్వాధీనం

భద్రాచలం పుణ్యక్షేత్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రధాన ఉత్సవాలు ఏ విధంగా నిర్వహిస్తారో అచ్చం అలాగే వారిఇంట రామయ్య ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉద్యోగ రీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అయినా చిన్ననాటి నుంచి ఆధ్యాత్మిక చింతన ఉండటంతో దానిపై ఉన్న మక్కువను చాటుకుంటూ ఈ ఉత్సవాలను ప్రతి ఏటా అత్యంత సంప్రదాయబద్ధంగా పూర్తి అలంకరణతో నిర్వహిస్తున్నారు. అంతే కాదు కుంచెతో శ్రీ సీతారామచంద్రస్వామి మూలవరులు, గరుత్మంతుని చిత్రంతో పాటు ఇతరత్రా దేవతా రూపాలను చిత్రీకరిస్తూ భద్రాద్రి రామాలయ అధికారులు, వైదిక బృందం, రామ భక్తులను సైతం ఆకట్టుకుంటున్నారు భద్రాచలానికి చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు దారా ముక్తేశ్వర్.


హంసవాహన రూపంలో స్వామి వారికి తెప్పోత్సవం


సర్వదేవతా అలంకారం


ముక్తేశ్వర్

దారా వారింట

'మినీ రామాయణం'

- భద్రాచలం దేవాలయంలో మాదిరిగా ఉత్సవాలు
- సంప్రదాయబద్ధంగా రామయ్యకు సేవలు
- తన ఇంట్లో నిర్వహిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
- చిత్ర లేఖనంలోనూ అందెవేసిన చెయ్యి

భద్రాచలం, ఆగస్టు 2: చిన్నతనం నుంచి చిత్రలేఖనంపై ఉన్న మక్కువతో పత్రికల్లో వచ్చే కార్టూన్‌లు చూసి భద్రాచలానికి చెందిన దారా ముక్తేశ్వర్. స్వయంగా చిత్రలేఖనం నేర్చుకున్నారు. క్రమంలో కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో మరింత దృష్టిసారించి చిత్రలేఖనంపై మరింత పట్టు సాధించారు. తమ అమ్మమ్మ వాళ్ల ఇంట్లో దేవతామూర్తులకు వస్త్రాలను కడుతుండటం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం చూసి అప్పటి నుంచి ఆధ్యాత్మిక చింతన ఏర్పడిందని ముక్తేశ్వర్ పేర్కొన్నారు. దీంతో బాల్యం నుంచి దేవతామూర్తుల చిత్రాలు వేయడం, వినాయక విగ్రహం అతి చిన్నవి సైతం తయారు చేశారు. ఈ క్రమంలో తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తనలోని ఆధ్యాత్మిక తృష్ణను గుర్తించి ప్రోత్సహించారు.

ఆలయంలో మాదిరిగా..

శ్రీరామనవమిని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని అధ్యయనోత్సవాలు, విశ్వరూప సేవ, పునర్వసు నక్షత్రం రోజున ప్రత్యేక అభిషేకం, అలంకరణ ఏ విధంగా భద్రాద్రి దేవస్థానంలో నిర్వహిస్తారో అచ్చం అదే రీతిలో తమ ఇంట్లో ఉత్సవాలు నిర్వహించడం విశేషం. ఈ సమయంలో తను సైతం సంప్రదాయ దుస్తులు ధరించి శ్రీ సీతారామచంద్రస్వామి మూర్తులకు అందమైన అలంకరణతో పాటు వస్త్రాలు ధరింపజేసి ప్రతి ఒక్కరిని ఆకట్టుకునే రీతిలో నిర్వహిస్తారు. దశావతారాలు, స్వామి వారికి గౌతమీలో తెప్పోత్సవం, ఉత్తరద్వార దర్శనం నిర్వహించే రీతిలోనే ప్రత్యేక అలంకారాలు, ప్రత్యేక వస్త్ర ధారణ చేయడం విశేషంగా చెప్పవచ్చు. ఇదే సమయంలో స్వామి వారికి పూజలు నిర్వహించి చెక్కర పొంగలి, కట్టె పొంగలి, పులిహోర, కదంబం తదితర ప్రత్యేక ప్రసాదాల నివేదన చేయడం జరుగుతుంది. పూర్తి ఆధ్యాత్మిక, సంప్రదాయ రీతిలో నిర్వహించే ఈ కార్యక్రమాల సమయంలో సలహాలు, సూచనలను తన మిత్రులైన భద్రాద్రి రామాలయ వైదిక బృందం నుంచి తీసుకుంటూ నిర్వహిస్తున్నారు.

ఆశీస్సులు.. ఆశీర్వాదాలు..

దారా ముక్తేశ్వర్‌లో ఉన్న ఆధ్యాత్మిక చింతన భావాలను భద్రాద్రి దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన దారా ముక్తేశ్వర్. మూడు అంగుళాల రాముని విగ్రహం బహూకరించారు. ప్రతి నెల స్వామి వారి జన్మనక్షత్రమైన పునర్వసు నాడు విశేష అలంకారాన్ని సైతం రామయ్యకు చేస్తుంటారు. ఇటీవల అయోధ్య రామమందిరం ప్రారంభం రోజున థర్మాకోల్‌తో అయోధ్య రామ మందిరం సెట్‌ను రూపొందించారు.

ఇదిలా ఉండగా 2022లో 0.8 సెం.మీ. గణేష్ ప్రతిమను చేయగా 2023లో 108 గణపతి మూర్తులను తయారు చేసి అందరికి పంపిణీ చేశారు. 2021లో భద్రాచలం వచ్చిన సమయంలో చినజీయర్‌స్వామికి వారి మాతృమూర్తి చిత్రపటం చిత్రీకరించి చినజీయర్‌స్వామికి అందజేశారు. భక్తరామదాసు వారసులు కంచర్ల శ్రీనివాస్ దారా ముక్తేశ్వర్. గృహానికి వచ్చి తను చేసిన అలంకరణలు చూసి ముచ్చటపడ్డారు.

వనజీవి రామయ్యను కలిసిన అటవీశాఖ శిక్షణ అధికారులు

ఖమ్మం రూరల్, ఆగస్టు 2: మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యను దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ అకాడమి శిక్షణ అటవీశాఖ అధికారులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా రామయ్య పర్యావరణానికి చేసిన కృషిని అడిగి తెలుసుకున్నారు. అటవీ సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వనజీవి వివరించారు. అనంతరం రామయ్య, జానమ్మ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకాడమి కోర్స్ డైరెక్టర్ గంగారెడ్డి, కూసుమంచి రేంజ్ అధికారి శ్రీనివాస్‌రావు, డిప్యూటీ రేంజర్ రామారావు, సిబ్బంది వెంకటేశ్వర్లు, నరసింహరావు, మధు పాల్గొన్నారు.

వైద్య నిపుణుల పోస్టులకు దరఖాస్తులు

భద్రాచలం, ఆగస్టు 2: భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో గైనకాలజిస్టు, అనస్తీషియా నిపుణుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు ప్రాతిపదికన వాక్ ఇన్ ఇంటర్వ్యూ పద్ధతిలో భర్తీ ఉంటుందని, గైనకాలజిస్టుకు నెలకు రూ.2 లక్షలు, అనస్తీషియా నిపుణులకు రూ.1.50 లక్షల వేతనం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు వైద్యశాల పనిదినాల్లో ఉదయం 10 నుంచి 5 గంటల వరకు మెడికల్ సూపరింటెండెంట్ చాంబర్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, అనుభవంతో కూడిన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని కోరారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలు

భద్రాచలం, ఆగస్టు 2: ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాల కోసం రెండో విడత ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఆశ్రమ పారిశ్రామిక శిక్షణ సంస్థ కృష్ణసాగర్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ధర్మాచారి తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.తెలంగాణ.జీవోవి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పదో తరగతి ఉత్తీర్ణులై ఆగస్టు ఒకటి నాటికి 14 సంవత్సరాలు నిండిన వారై ఉండాలని తెలిపారు. ఈ నెల 12 వేతదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఫ్లైఓవర్ మంజూరు పట్ల వద్దిరాజు హర్షం



ఖమ్మంటౌన్, ఆగస్టు 2: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ మంజూరు చేయటంపట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దీనివల్ల ఖమ్మంనుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు కష్టాలు తప్పుతాయన్నారు. ఫ్లైఓవర్ లేకపోవటం తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని తాను గతంలో కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చానని, అందుకు స్పందించి ఫ్లైఓవర్‌ను మంజూరు చేసినందుకు కేంద్రమంత్రికి వద్దిరాజు కృతజ్ఞతలు తెలిపారు

పెనగడపను సందర్శించిన రాష్ట్ర సర్వేలైన్స్ బృందం

చుంచుపల్లి, ఆగస్టు 2: చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాథకమిక ఆరోగ్యకేంద్రంను తెలంగాణ రాష్ట్ర సర్వేలైన్స్ బృందం శుక్రవారం సందర్శించారు. వర్షాకాలం సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తుగా తీసుకుంటున్న చర్యలు, ప్రణాళికలను పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ డీసీజ్ సర్వేలైన్స్ ప్రోగ్రాంలో (ఐడిఎస్‌పి) భాగంగా ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్(ఐ.హెచ్.ఐ.పి)లో నమోదు నమోదు అవుతున్న వివిధ రకాలైన వ్యాధులను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎపిడిమియలజిస్ట్ మోహన్‌కురువ, సభ్యులు ముక్కంటేష్, డాక్టర్ రాజీవ్ ఆనంద్ మైక్రోబయాలజిస్ట్, జిల్లా ఎపిడిమియాలజిస్ట్ ఇమ్మానుయేలు, పెనగడప వైద్యాధికారి డాక్టర్ నేహ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రామవరం, సఫాయి బస్తీ, పాత కొత్తగూడెం, వివిధ ఉపకేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐడీవోసీలోని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాయక్‌ను కలిసి అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోను జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించారు.


పెనగడప ఆసుపత్రిని సందర్శించిన సర్వేలైన్స్ సభ్యులు

రవాణాశాఖ నిబంధనలు పాటించాలి

- భద్రాద్రి జిల్లా ఆర్టీవో సదానందం

చుంచుపల్లి, ఆగస్టు 2: రవాణాశాఖ నిబంధనలు వాహనదారులు పాటించాలని నూతనంగా భద్రాద్రి జిల్లా ఆర్టీవోగా గజ్జల సదానందం శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. నల్గొండ జిల్లాలోని నకిరేకల్ ప్రాంతానికి చెందిన సదానందం మట్టంపల్లిలో విద్యనభ్యసించి 1991లో టైపిస్ట్‌గా తొలిసారి రవాణాశాఖ ఉద్యోగిగా చేరారు. అంచెలంచెలుగా ఎదుగుతూ ఉన్నతాధికారుల మన్నలను పొంది హైదారాబాద్ సౌత్ ఆర్.టి.వోగా పని చేస్తూ బదిలీపై భద్రాద్రి జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో ఫిట్నెస్ చేసుకోని వాహనాల శాతం అధికంగా ఉందని, తప్పక వాటిని రెన్యువల్ చేపించుకోవాలని సూచించారు. ఆంధ్రవాహనాలు లైఫ్‌ట్యాక్స్ కట్టాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే ఆ వాహన యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

నియమ నిబంధనలు తప్పక పాటించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. శాఖాపరమైన ఎలాంటి సమస్య తెలెత్తిన తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఖమ్మం కలెక్టర్‌తో ఆర్మీ అధికారుల భేటీ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 2: ఆర్మీ శిక్షణకేంద్రం ఏర్పాటుకు రఘునాథపాలెంలో కేటాయించిన స్థలం విషయమై ఆర్మీ అధికారులు శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలెక్టరేట్‌లో ఆయన కలిశారు. ఈ సందర్భంగా రఘునాథపాలెంలో ఆర్మీ శిక్షణకేంద్రానికి కేటాయించిన 1.23 ఎకరాల స్థలాన్ని అప్పగించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ని వారు కోరారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం వెళ్లే దారిలో గల ఎన్సీసీ బెటాలియన్ కార్యాలయాన్ని పాత సబ్ జైలుకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ని ఎన్సీసీ కమాండెంట్ కోరగా, జైళ్ల శాఖ డీజీని సంప్రదించి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

క్షేత్రస్థాయి అధ్యయనం ..

క్షేత్ర స్థాయి అధ్యయనాలు విధినిర్వహణకు ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో భారత ప్రభుత్వ సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసెస్ అసిస్టెంట్ సెక్షన్ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. వారితో క్షేత్ర స్థాయి అనుభవాలను పంచుకున్నారు.

అంకితభావంతో పనిచేయండి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్
- ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీలు
- తరగతి గదులు, టాయిలెట్లు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం
- విద్యాబోధన, విద్యార్థుల సామర్థ్యాలపై అసంతృప్తి
- ఉపాధ్యాయులు, వార్డెన్, సిబ్బంది స్థానికంగా ఉండాలని హెచ్చరిక


ఉపాధ్యాయుడిగా మారి బోధిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

పినపాక, ఆగస్టు 2: ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో పని చేసే ఉపాధ్యాయులు ఉద్యోగులు తమ వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావంతో పని చేయాలని ఐటీడీఏ పీవో బి. రాహుల్ సూచించారు. మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో బి. రాహుల్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించి, తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలోని తరగతి గదులను, టాయిలెట్లు, డార్మెటరీ బ్లాక్, కిచెన్ షెడ్లు, నాసిరకంగా ఉన్న కూరగాయలను, వసతిగృహ పరిసరాలను పరిశీలించిన పీవో, ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం, అపరిశుభ్రంగా ఉండడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించి, ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం, స్నాక్స్ పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సీజనల్ పండ్లు ఇవ్వాలన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ఉంటాయి కనుక విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాత్రిపూట విద్యార్థులు బయటకు రాకుండా పర్యవేక్షణ చర్యలుండాలన్నారు. ఉపాధ్యాయులు స్థానికంగా ఉండి, సాయంత్రం సమయంలో సబ్జెక్టుల వారీగా వెనుకబడిన పిల్లలకు ప్రత్యేకంగా బోధించి, వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయ్ కిరణ్, భాను, సిబ్బంది పాల్గొన్నారు.

బడి పంతులుగా మారిన ఐటీడీఏ పీవో రాహుల్.

పినపాక మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో బి. రాహుల్ బడి పంతులుగా మారారు. మొదటగా 5వ తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లిన ఆయన గణితంలోని చతుర్విధ సామర్థ్యాలను(కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారములు) పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పదోతరగతి విద్యార్థుల వద్దకు వెళ్లిన ఆయన, గణితంలోని కొన్ని ప్రశ్నలడిగి, తానే స్వయంగా ఉపాధ్యాయుడి అవతారం ఎత్తారు. పదోతరగతి విద్యార్థులకు బోధన చేశారు. ఈ సందర్భంగా పిల్లలు గణితం, ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టులలో బాగా వెనుకబడి ఉన్నారని, సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని, విద్యార్థులకు కనీస సామర్థ్యాలలో మెరుగయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

ఏటీడీవోలు సమన్వయంతో పని చేయాలి

భద్రాచలం: ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల విద్యాబోధన పట్ల సంబంధిత ఏటీడీవోలు, ప్రత్యేక అధికార్లు వారి పరిధిలోని పాఠశాలలను సమన్వయంగా ఉండి పాఠశాలలు సక్రమంగా నడిచేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఏటీడీవోలు, పాఠశాలల ప్రత్యేక అధికారులతో పాఠశాలల పనితీరుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పనితీరు బాగోలేదని పిల్లలకు సరైన పద్ధతిలో విద్యాబోధన జరగడం లేదని, కొన్ని పాఠశాలల్లో పిల్లల చేత పనులు చేస్తున్నారని, ప్రధానోపాధ్యాయుల అనుమతి లేకుండా పాఠశాలల విద్యార్థినులు నుంచి వెళ్లిపోవడం పరిశుభ్రత పట్ల శ్రద్ధ తీసుకోకపోవడం వంటి విషయాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఏ సమాచారం వచ్చినా ముందుగా గిరిజన సంక్షేమ శాఖ ద్వారా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయం నిర్వహణ దీనిపై సంబంధిత డీడీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికరి జనరల్ డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, విజయలక్ష్మి, ఈఈ తానాజీ, ఏడీ అగ్రికల్చర్ భాస్కర్, ఏసీఎంవో రమణయ్య, డీటీఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏటీడీవోలు జహీరుద్దీన్, సత్యవతి, అశోక్, చంద్రమోహన్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులకు న్యాయం చేయాలి

మధిర, ఆగస్టు 2: న్యాయవాదులు, న్యాయమూర్తులు అంకితబావంతో పనిచేసి కక్షిదారులకు న్యాయం చేకూర్చాలని సత్తుపల్లి జిల్లా సెషన్స్ జడ్జ్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన మధిర కోర్టును తనిఖీ చేశారు. కోర్టుకు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మధిర కోర్టు జడ్జి టీ కార్తికరెడ్డి, బార్ అధ్యక్షులు బోజెడ్ల పుల్లారావు, న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, తూములూరి కృష్ణారావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, సుంకు మోహన్‌దాస్, దేవరపల్లి సుబ్రహ్మణ్యం, కట్టా పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

మైనింగ్ అక్రమంగా నిర్వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 2: ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్ ప్రాంతాల్లో బైరటీస్ అక్రమ తవ్వకాలు, తరలింపు విషయమై గురువారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన వెలుగుమట్ల అర్బన్ పార్క్ ప్రాంతాల్లో బైరటీస్ అక్రమ తవ్వకాలు కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ స్వామి, ఆర్ఐ రమేష్, మైనింగ్ ఆర్ఐ నాగరాజు, టీపీ సంతోష శుక్రవారం అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న ప్రాంతానికి వెళ్లి అక్రమ బైరటీస్ తవ్వకాల జరిగినట్లు గుర్తించారు. మైనింగ్ అక్రమంగా నిర్వహిస్తే ఎంతటి వారినైనా వదిలేది లేదని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయమై మైనింగ్ ఏడి సాయినాథ్‌ను సంప్రదించగా అక్రమ మైనింగ్ జరిగిన ప్రాంతాలకు సంభందించిన స్థల యజమానులకు నోటీస్‌లు అందించి ఈ ప్రాంతాల్లో మళ్లీ అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాత్రి వేళల్లో నిఘా పెట్టి అక్రమ మైనింగ్‌కు పాల్పడే వ్యక్తులపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. ప్రైవేటు స్థల యజమానులు కూడా అక్రమ మైనింగ్ జరుగుతుందని తెలిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని తెలిపారు.


వెలుగుమట్లలో అక్రమంగా తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

'ఇంటింటికీ ఇన్నోవేటర్' దరఖాస్తుల గడువు పొడిగింపు

కొత్తగూడెం, అగస్టు 2: ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలకు దరఖాస్తులకు ఈ నెల 10వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 3 వ తేదీ వరకు ఉన్న గడువును 10వ తేదీ వరకు పొడిఒగించినట్లు తెలిపారు. ఇంటింటా ఇన్నోవేషన్‌లోవినూత్న ఆవిష్కరణలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఔత్సాహికులు ఆవిష్కరణల్లో తమ ప్రతిభను చాటుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత ఆరు సంవత్సరాలుగా ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగావిష్కరణల ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

జనరల్ ఆస్పత్రి ఆర్‌ఎంవోగా కళావతి బాధ్యతల స్వీకరణ


ఆర్ఎంవోగా రిపోర్ట్ చేస్తున్న కళావతిబాయి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 2: జనరల్ ఆస్పత్రి ఆర్ఎంవోగా కళావతి బాయి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తొలుత ఆమె సూర్యాపేట నుంచి బదిలీ ఉత్తర్వులతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్ కుమార్‌ను కలిశారు. ఆ తర్వాత ఆమె చాంబర్‌కు వెళ్లి బాధ్యతలను స్వీకరించారు. ఆమెకు డిప్యూటీ సూపరింటెండె ంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవోలు డాక్టర్ రాథోడ్‌నాయక్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ అమర్‌సింగ్‌లో స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఖమ్మం మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రికి ఇన్‌చార్జ్‌లే ఆర్ఎంవో గా వ్యవహరించగా, ప్రస్తుతం పూర్తి స్థాయి ఆర్ఎంవో వచ్చినట్లైంది.

సారపాకలో 247 కిలోల గంజాయి పట్టివేత

- ఆరుగురి అరెస్టు.. మూడు కార్లు స్వాధీనం

బూర్గంపాడు, ఆగస్టు 2: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో శుక్రవారం భారీ మొత్తంలో గంజాయి పట్టుబడింది. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. బూర్గంపాడు ఎస్ఐ రాజేష్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారయణ, ఎస్ఐలు ప్రవీణ్, సుమన్, సిబ్బందితో కలిసి సారపాక శివారులోని పల్లెప్రకృతి వనం వద్ద వాహన తనీఖీలు చేపట్టారు. ఈ సమయంలో భద్రాచలం నుంచి మణుగూరు క్రాస్ రోడ్డు వైపునకు వెళ్తున్న మూడు కార్లు పోలీసులను చూసి వెనుకకు తిప్పుకునే ప్రయత్నం చేయగా అనుమానం వచ్చి పోలీసులు ఆ కార్లను తనిఖీ చేయగా కార్ల డిక్కీలలో గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. దాంతో ఆయా కార్లలో ఉన్న ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం గ్రామానికి చెందిన కాద తనోజ్‌హర్షిత్, హైదరాబాద్‌లోని మంగలహాట్ ప్రాంతానికి చెందిన కిషన్‌కుమార్ దాస్, జనగాం జిల్లా కొడకండ్ల మండలం రేగుల గ్రామానికి చెందిన భూక్యా దేవేందర్, బూర్గంపాడు మండల పరిదిలోని సారపాక పంచాయతీలోని గాంధీనగర్‌కు చెందిన రావులపల్లి ప్రతాప్, తాళ్లగొమ్మూరుకు చెందిన ములగాడ అన్వేష్, హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12 ఏరియాకు చెందిన బావికాడి శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ.61,82,125లు విలువ చేసే 247.285కేజీల గంజాయి, ఏడు సెల్‌ఫోన్‌లు, రూ.8,300నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మూడు కార్లలో ఓ కారు ముందు పైలట్ వాహనంగా వెళుతుండగా మిగిలిన రెండు కార్లలో గంజాయి తరలిస్తున్నట్లు తెలిపారు. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకకు చెందిన దుగ్గెంపూడి శివశంకర్‌రెడ్డి అనే వ్యక్తి ఏపీలోని సీలేరు ప్రాంతం నుంచి ఏటవో ఏజెన్సీ ఏరియాకు చెందిన కిల్లో మోహన్, మల్కాన్‌గిరి చిత్రకొండ ప్రాంతానికి చెందిన పోటేరు మోహన్‌రావు, ఒడిస్సాలోని బచ్చలూరు ప్రాంతానికి చెందిన రామారావు ద్వారా గంజాయి సేకరించి హైదారాబాద్‌లోని అప్పర్ దూల్‌పేట్ ప్రాంతానికి చెందిన మహేందర్‌సింగ్ అనే వ్యక్తికి ఇవ్వటం కోసం వెళ్తున్నట్లు విచారణలో తెలిందని పోలీసులు తెలిపారు.


గంజాయిని పట్టుకున్న పోలీసులు

అలాగే గంజాయి రవాణా చేసేందుకు కారును ఏర్పాటు చేసిన జనగాంకు చెందిన లతీఫ్ అనే వ్యక్తి వ్యాపారంలో భాగస్వామిగా ఉన్నట్లు తెలిపారు. శివశంకర్‌రెడ్డి, మోహన్, మహేందర్‌సింగ్, మోహన్‌రావు, రామారావు, లతీఫ్‌లు పరారీలో ఉన్నారని.. ఎరారీలో ఉన్న శివశంకర్‌రెడ్డిపై సుమారు 10గంజాయి కేసులు, కిషన్‌కుమార్ దాస్‌పై రెండు గంజాయి కేసులు, తనోజ్ హర్షిత్, మునగాడ అన్వేష్‌లపై చెరొక గంజాయి కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టుబడిన ఆరుగురితో పాటు పరారీలో ఉన్న ఆరుగురు మొత్తం 12మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, బూర్గంపాడు ఎస్ఐ రాజేష్, అదనపు ఎస్ఐ నాగభిక్షం, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు ప్రవీణ్, సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులను అభినందించిన ఎస్పీ

బూర్గంపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం భారీగా గంజాయి పట్టుబడిన నేపథ్యంలో వాహన తనిఖీల్లో చకచక్యంగా వ్యవహరించి 247.285కేజీల గంజాయిని పట్టుకున్న సీసీఎస్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు ప్రవీణ్, సుమన్, బూర్గపాడు ఎస్ఐ రాజేష్, సిబ్బందిని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు. గంజాయి లాంటి మత్తు పదార్థాల రవాణా, వినియోగానికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే 8712682133, 8712682135 నంబర్లుకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయిరహిత జిల్లాగా చేయడంలో జిల్లా ప్రజలు కూడా తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరారు.

మధిరలో గంజాయి పట్టివేత

మధిరటౌన్, ఆగస్టు2: ఓ స్కూటర్ పై గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపు లోకి తీసుకుని వారి నుంచి రెండున్నర కిలోల గంజాయిని స్వాదీనం చేసుకున్నట్లు టౌన్ ఎస్ఐ సంధ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం రాయపట్నం బ్రిడ్జి సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానస్పందంగా వ్యవహరించడంతో వారి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా అందులో రెండు ప్యాకెట్ల లో ఉన్న రెండున్నర కేజీల గంజాయిని గుర్తించి స్వాదీనం చేసుకున్నారు. నిందుతులైన మధిరకు చెందిన కళ్యాణపు వంశీ తో పాటు మధిర మండలం బయ్యారానికి చెందిన రెంటపల్లి మహేష్ మరియు ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం ఊటుకూరు కు చెందిన తమ్మిశెట్టి కిరణ్ ను అదుపలోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

మావోయిస్టుల కదలికలపై

డేగ కన్ను..

- అడవులను జల్లెడ పడుతున్న గ్రేహౌండ్ బలగాలు
- భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల సరిహద్దుల్లో మోహరింపు
- బిక్కు బిక్కుమంటున్న ఏజెన్సీ ప్రజలు



కరకగూడెం మండలంలో కూంబింగ్ నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు(ఫైల్)

కరకగూడెం, ఆగస్టు2: మారుమూల ఏజెన్సీ గ్రామాలలో మావోయిస్టుల కదలికలపై పోలీసులు, గ్రేహౌండ్ ప్రత్యేక బలగాలు డేగ కన్ను వేశారు. అడవులలో గ్రై హౌండ్ బలగాలు కూం బింగ్ నిర్వహిస్తున్నారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి మణుగూరు డివిజన్, గుండాల, దామరతోగు ములుగు, జయశంకర్, మహబూబాబాద్ జిల్లాలోని రంగాపురం, తాడ్వాయి, ఏటూర్‌నాగారం, పెద్దపల్లి గంగారం, పోపుగొండ్ల, కామరం, నెర్సుగూడెం, దుబ్బగూడెం అటవీ ప్రాంతాలలో మావోయిస్టు



వలస ఆదివాసీ గ్రామాల్లోని గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

బలగాలు సంచరిస్తున్నట్లు సమాచారంతో పోలీసులు అడవులను జల్లెడ పడుతున్నారు. పలు ఆదివాసీ గ్రామాలలో మావోయిస్టుల కదలికలపై పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని, బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములుగు జిల్లా సరిహద్దు అయినా కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి, మణుగూరు. పినపాక, తాడ్వాయి, ఏటూర్‌నాగారం, మంగపేట, పెద్దపల్లి, గంగారం, పోపు గొండ్ల, కామరం, నెర్సుగూడెం, దుబ్బగూడెం మండలాల్లో అటవీ ప్రాంతాలు ఎక్కువగా ఉండటం.. ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలకు గోదావరి పరివాహక ప్రాంతాలు కావడం పూర్తి ఏజన్సీ ప్రాంతాలు అవడంతో మావోయిస్టుల కదలికలపై పోలీసులు, గ్రెహౌండ్ బలగాలు గాలింపు చర్యలు ముమ్మరంగా చేపడుతున్నారు.

గతంలో జరిగిన ఎన్‌కౌంటర్లు..

2020 సంవత్సరం మార్చి 10న కరకగూడెం మండలంలోని నీలాద్రిపేట వలస ఆదివాసీ గ్రామ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎన్ కౌంటర్ జరిగింది. జూలై నెల 15న మణుగూరు, కరకగూడెం సరిహద్దు మల్లెతోగు ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరగగా, ఓ గ్రేహౌండ్ పోలీస్ చేతికి గాయం అయ్యింది. పినపాక మండలంలోని అమరారం పిట్టతోగు ప్రాంతాలలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. సుమారు నాలుగేళ్ల తరువాత కరకగూడెం, గుండాల, తాడ్వాయి మండలాల సరిహద్దు దామరతోగు అడవిలో గురువారం పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పుల్లో నల్లమూరి అశోక్ అలియాస్ విజేందర్ మృతి చెందాడు. ఇటీవల దామరతోగు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద పోలీసులు తుపాకి స్వాధీనం చేసుకున్నారు.

మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో...

ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన వలస ఆదివాసీ గ్రామాల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నందున వారి కదలికలు ఎక్కువగా ఉంటాయని పోలీసులు డేగ కన్ను వేశారు. జూలై 28 నుంచి మావోయిస్టు వారోత్సవాలు జరుగుతున్నాయి. కాగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్, పెద్దపల్లి జిల్లాలో వారి కదలికలపై ప్రత్యేక బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నారు జిల్లాలో ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి మావోల కదలికలు ఉన్నట్లు సమాచారంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ నేతృత్వంలో పోలీసులు అనునిత్యం గాలింపు చర్యలకు దిగుతున్నారు. ఈ సందర్భంగా వలస ఆదివాసీ గ్రామాలలో ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, కరకగూడెం ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివాసులతో మాట్లాడి మావోయిస్టుల కదలికలపై ఆరా తీస్తున్నారు. సరిహద్దులలో ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేస్తున్నా రు. అనుమానితులుగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' విజయవంతం చేయాలి

● కలెక్టర్ జితేష్ వీ. పాటిల్



సిమెంట్ ఒరలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

కొత్తగూడెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం విజయవంతం కావడానికి జిల్లాలోని అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వీ. పాటిల్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 5 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు పరచాలని అధికారులను ఆదేశించారు. ఐదురోజుల పాటు చేపట్టవలసిన రోజువారీ కార్యక్రమాల వివరాలను ఆయన తెలిపారు.

నాణ్యమైన సిమెంట్ ఒరలను సిద్ధం చేయండి

ఇంకుడు గుంతల నిర్మాణం కోసం నాణ్యమైన సిమెంట్ ఒరలను సిద్ధం చేయాలని కలెక్టర్ జితేష్. వీ పాటిల్ అన్నారు. శుక్రవారం చుంచుపల్లి మండలం నందాతండా వద్ద ఉన్న ఒరల దుకాణాన్ని సందర్శించారు. అక్కడ తయారు చేస్తున్న ఒరలను, వాటిపై కప్పులను పరిశీలించారు. వాటి తయారీకి అయ్యే ఖర్చుల వివరాలను తయారీదారుడి నుంచి తెలుసుకున్నారు. ఒరలను తయారు చేయడంలో కొన్ని మార్పులను చేసి సిద్ధం చేయాలని సూచనలందించారు. ముందుగా ఒకటి మోడల్‌గా సిద్ధం చేసి అందించాలని తయారీదారుడిని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, చుంచుపల్లి తహసీల్దార్ పానెం కృష్ణ, ఎంపీడీవో విడివి అశోక్‌కుమార్, ఎంపీవో గుంటి సత్యనారాయణ, ఏపీవో ఈజీఎస్ రఘుపతి, ఈసీ పిల్లి నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, భూమిక, పాల్గొన్నారు.

భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణమే మనమిచ్చే ఆస్తి

- ఎక్సైజ్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి



మొక్క నాటుతున్న ఎక్సైజ్‌శాఖ ఈఎస్ నాగేందర్‌రెడ్డి

సత్తుపల్లి, ఆగస్టు2: భావితరాలకు మనమిచ్చే ఆస్తి స్వచ్ఛమైన వాతావరణమేనని ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి అన్నారు. 75వ వనమహోత్సవ కార్యక్రమాన్ని మొదటిసారి ఎక్సైజ్ శాఖ పరిధిలోని కిష్టారం గ్రామ శివారులోని చెరువు కట్టపై ఖర్జూరం మొక్క నాటి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వనమహోత్సవంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. నాటిన మొక్కలను పరిక్షించాల్సిన బాధ్యతను మనమంతా తీసుకోవాలని సూచించారు.

2022వరకు జిల్లాలో 123గంజాయి కేసులు ఉండగా 2023లో 60కేసులు ఒక్క ఏడాదే నమోదవ్వగా ఈనెలాఖరులోగా గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో భాగంగా నిరంతరం వాహనాల తనిఖీ, రూట్ వాచ్, రైల్వే, బస్ స్టేషన్లలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామన్నారు. హానికరమైన గంజాయి పట్ల అవగాహనతో యువత ఉండాలని, ప్రజల సహకారంతోనే ఇది సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎక్సైజ్ స్టేషన్ సీఐ సీ.ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు త్వరితగతిన వ్యవసాయ విద్యుత్ సర్వీస్‌లు

● కొత్తగూడెం ఎస్ఈ భీకంసింగ్

కొత్తగూడెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతులకు త్వరితగతిన వ్యవసాయ విద్యుత్ సర్వీస్ కనెక్షన్లను మంజూరు చేస్తున్నామని కొత్తగూడెం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ భీకంసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఎనిమిది నెలల్లో 2,080 సర్వీస్‌లను మంజూరు చేశామని, ఈ ఏడాది జూలై 31 వరకు 2,344 సర్వీస్‌లను మంజూరు చేశామని తెలిపారు. గత ఏడాదితో పోల్చుకుంటే 264 సర్వీసుల మంజూరు పెరిగిందని, దాదాపు 12.7 శాతం వృద్ధి సాధించామని తెలిపారు. మంజూరైన సర్వీస్‌ల వివరాలను మొత్తం ఆన్‌లైన్ చేయడం ద్వారా, ఎప్పటికప్పుడు దరఖాస్తు ఎక్కడ పెండింగ్ ఉంది, ఎవరి దగ్గర పెండింగ్ ఉంది, దానికి గల కారణాలు సవివరంగా అగ్రికల్చర్ పోర్టల్ (ఆన్‌లైన్)లో చూసుకునే వెసులుబాటు ఉందన్నారు. దీని ద్వారా మంజూరులో ఆలస్యం లేకుండా ఉంటుందని అన్నారు. విద్యుత్ అధికారులు రైతులకు మరింత చేరువయ్యే విధంగా, రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

దళితబంధు పూర్తి లబ్ధిని అందించాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 2: దళితబంధు లబ్దిదారులకు పథకం పూర్తి లబ్దిని అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో దళితబంధు చింతకాని మండల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించి, పథక అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతకాని మండలంలో దళిత బంధు పథక అర్హులైన లబ్ధిదారులందరికీ పథక లబ్ధి చేకూరేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. మండలంలో 25 గ్రామాల నుంచి 3,462 మంది అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, దళితబంధు పథకం కింద వివిధ రకాల యూనిట్లను మంజూరు చేసి, గ్రౌండింగ్ చేయడం జరిగిందన్నారు. యూనిట్ల విలువను బట్టి, దళితబంధు పథక అర్హత మంజూరు మొత్తం నుంచి నిధులను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. 1888 మంది లబ్ధిదారులకు పూర్తి మొత్తం అందచేసినట్లు, మిగతా వారికి ఎంపిక ప్రకారం మొత్తాన్ని అందజేశామన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, లబ్ధిదారుడికి ఆర్థికాభివృద్ధి చేకూరేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో ఎస్. వినో ద్, ఎస్సీ కార్పొరేషన్ అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ అధికారి నవీన్‌బాబు, చింతకాని మండల దళితబంధు పథక గ్రామ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

22 మంది బాల కార్మికులకు విముక్తి: ఎస్పీ

కొత్తగూడెం, అగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ముస్కాన్-10వ విడతలో జిల్లా వ్యాప్తంగా 22 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఎస్పీ రోహిత్‌రాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కోసం జిల్లాలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసామని, అందులో భాగంగా జూలై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఇందులో 22 మంది బాల కార్మికులను గుర్తించామని పేర్కొన్నారు. అందులో 20 మంది మగ పిల్లలు, ఇద్దరు బాలికలు ఉన్నారని అన్నారు. 20 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించామని, ఇద్దరిని బాలుర సంరక్షణ కేంద్రానికి తరలించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లలను పనిలో పెట్టుకున్న 20 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. బాలల హక్కులను కాపాడాల్సి బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. బాల కార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించిన ప్రత్యేక బృందాల సభ్యులను ఎస్పీ అభినందించారు.

జ్వరంతో మహిళ మృతి



సక్రి(ఫైల్)

కొణిజర్ల,ఆగస్టు2: జ్వరంతో మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధరావత్ సక్రి(60) అనే మహిళ గత నాలుగు రోజులు నుంచి జ్వరంతో ఇబ్బందిపడుతుంది. ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని ఇంటి వద్ద ఉంటుంది. జ్వరంతో ఇబ్బందిపడుతూ ఉదయం మృతి చెందిన్నట్లు తెలిపారు. ఇంటిముందు సీసీరోడ్డుపై అపరిశుభ్రంగా ఉండటం వలన దోమలకు జ్వరంవచ్చి మరణానికి కారణమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో అపరిశుభ్రత మీద మృతురాలు పంచాయతీ కార్యదర్శికి కూడ రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిందని, ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. జ్వర విషయమై స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి రమేష్‌ను వివరణ కోరగా.. సాధారణ జ్వరమేనన్నారు. ఆసుపత్రి రిపోర్ట్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. గత నెల 30న గ్రామంలో డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యాకు సంబందించి వైద్యశిబిరం ఏర్పాటు చేసి 9మంది నుంచి రక్తపరీక్షలు కూడా చేయించామని అన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

- లారీ, ట్రాలీ ఆటో సీజ్

జూలూరుపాడు, ఆగస్టు 2: లారీలో లోడ్ చేస్తుండగా సుమారు 20 క్వింటాల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన గురువారం అర్ధరాత్రి మండలంలో చోటు చేసుకుంది. ఖమ్మం జిల్లా ఏన్కూరుకు చెందిన నారాయణ రాజు నరసింహారావు అనే వ్యాపారి జూలూరుపాడు మండలంలో వివిధ గ్రామాల్లో ప్రజల వద్ద నుంచి రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి పాపకొల్లులో నిల్వచేశాడు. ఇతర ప్రాంతానికి బియ్యాన్ని రవాణా చేసేందుకుగాను మండలంలోని కాకర్ల-దుబ్బతండా గ్రామాల మధ్య రహదారి పక్కన లారీని నిలిపి ఆటోలో పాపకొల్లు నుంచి బియ్యాన్ని తరలించి, సదరు వ్యాపారి లారీలో హమాలీలతో లోడ్ చేయిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు.. సీఐ ఇంద్రసేనారెడ్డి ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. 20 క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ట్రాలీ ఆటో, లారీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సదరు వ్యాపారిపై 6ఏ కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలంగాణాను అప్పుల రాష్ట్రంగా మార్చిన బీఆర్ఎస్

- కిసాన్ సెల్ రాష్ట్ర సలహదారు జంజిరాల రాజేష్



మాట్లాడుతున్న జంజిరాల రాజేష్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 2: గత పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందని కిసాన్ సెల్ రాష్ట్ర సలహాదారు జంజిరాల రాజేష్ విమర్శించారు. శుక్రవారం కిసాన్ సెల్ రాష్ట్ర సలహాదారుడిగా నియామకం జరిగిన తర్వాత తొలిసారిగా ఖమ్మం జిల్లాకు వచ్చిన ఆయన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలోని బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులను దండుకున్నాయని ఆరోపించారు. రూ.7లక్షల కోట్లు అప్పులు తెలంగాణ ప్రజలపై ఆర్థిక భారం మోపాయన్నారు. కాంగ్రెస్ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులు పక్షాన నిలబడి ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా కాంగ్రెస్‌కు అప్పగిస్తే, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా వాటిని తట్టుకొని సరైన ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు వెళ్తూ ఇప్పటికే ఆరు గ్యారెంటీ పథకాలతో పాటుగా రైతు రుణమాఫీ రూ.1.5లక్షలు ప్రతి రైతుకు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. తనకు పదవీ రావడంలో సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి, కేంద్ర మంత్రి రేణుకాచౌదరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు వెగ్గళం పాండురంగాచారి పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మధిరటౌన్, ఆగస్టు2: బాలికపై అత్యాచారం చేసిన కేసులో ఓ యువకుడితో పాటు అతనికి సహకరించిన మరో మహిళపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు మధిర టౌన్ ఎస్ఐ సంధ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... ఓ మండల కేంద్రానికి చెందిన ఇనపనూరి దేవవర్మ అతని స్నేహితురాలు లావణ్యలు అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక తండ్రికి బాగాలేదని చెప్పి గత నెల 30న మధిరకు తీసుకువచ్చారు. లావణ్య వారిద్దరిని తన గదిలో ఉంచి, ఇప్పుడే వస్తానని చెప్పి బైటకు వెళ్లింది. ఇంతలోపు నిందితుడు ఆ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తన తండ్రికి తెలపడంతో అతడు మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారించి నిందితుడు దేవవర్మతో పాటు అతడికి సహకరించిన లావణ్యలపై కేసు నమోదు చేసి, వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కిష్టారంలో ప్రత్యేక వైద్య శిబిరం

సత్తుపల్లిరూరల్, ఆగస్టు2: వర్షాకాలం దృష్ట్యా సింగరేణి ప్రభావిత ప్రాంతమైన కిష్టారంలోని మదర్‌థెరిస్సా కాలనీ, హైస్కూల్, ఎస్సీ కాలనీ, కమ్యూనిటీ హాల్స్ వద్ద శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టారం ఓసీ పీవో ఎంవీ.నరసింహారావు మాట్లాడుతూ 135మంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నరసింహారావు, శిరీష, పంచాయితీ సెక్రటరీ మద్దెల రవి, సంక్షేమాధికారి విజయసందీప్, పానెం ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి



వెంకటనారాయణ

చంద్రుగొండ, ఆగస్టు 2: అనుమానాస్పద స్థితిలో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అయ్యన్నపాలెంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన పోట్రు వెంకటనారాయణ(40) గురువారం ఉదయం వ్యవసాయ పనుల నిమితం పొలంలోకి వెళ్లాడు. చీకటి పడినా అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం సమీప ప్రాంతాల్లో వెతుకుతుండగా, సమీపంలోని రైలు కట్టపై మృతి చెంది ఉన్నాడు. మృతుడి అన్న సత్యనారాయణ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

చికిత్స పొందుతూ మహిళ...



జోష్నరాణి(ఫైల్)

మణుగూరు, ఆగస్టు 2: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మణుగూరులో శుక్రవారం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరులోని పీవీ కాలనీ సంతోష్‌నగర్ గ్రామ ప్రధాన రహదారిపై గత నెల 22వ తేదీన ఏరియా ఆసుపత్రికి వైద్య సేవల కోసం సింగరేణి కార్మికుడు రామ్మోహన్ ఆయన భార్య జోష్నరాణిలు కారులో వెళ్తున్నారు. షార్ట్ సర్క్యూట్‌తో కారు అగ్నిప్రమాదానికి గురైన సంఘటనలో దంపతులు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తగూడెం, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. హైద్రాబాద్‌లో చికిత్స పొందుతూ రామ్మోహన్ గత నెల 29న మృతి చెందాడు.

రామ్మోహన్ భార్య జోష్నరాణి(42) కూడా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు వారం వ్యవధిలో మృతి చెందడంతో చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. కాగా జోష్నరాణి తండ్రి జక్కుల జార్జి వయో వృద్ధుడు. ఈ కుటుంబంలో మిగిలిన ఇద్దరు పిల్లలు, వయోవృద్ధుడైన తాతల పోషణ వారి ఆలన పాలన ఎవరు చూసుకుంటారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

సింగరేణి యాజమాన్యం స్పందించాలి

మణుగూరు కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ-2 గని ఎస్అండ్‌డి సెక్షన్‌లో పని చేసే కార్మికుడు పి రామ్మోహన్ అతని భార్య మృతి చెందటం పట్ల ఏరియా కార్మిక సంఘాల నాయకులు కృష్ణంరాజు, జాన్, రాంగోపాల్, ప్రభాకర్, వెంకట్, నాసర్ పాష, రత్నం తదితరులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఏరియా యాజమాన్యం అనాథలుగా మారిన రామ్మోహన్ కుమారులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 2: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన సంఘటన నగరంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం అంజలిపురం గ్రామానికి చెందిన గోటం నాగలక్ష్మి(26), ఆమె భర్త నాగయ్యలు గత ఐదేళ్లుగా ఓ ప్రయివేట్ మెడికల్ అకాడమీలో ఇద్దరు పనిచేస్తున్నారు. భర్త వంట మాస్టర్‌గా, భార్య ఆయాగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం తరగతి గదులకు సంబంధించిన తాళాలను కింది నుంచి పై అంతుస్తులోకి వేయాలని ప్రయత్నించగా, అవి పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడ్డాయి. దీంతో ఆ తాళాలను ఓ రాడ్డు సహాయంతో తీసేందుకు ప్రయత్నించగా, విద్యుత్ షాక్ గురైంది. వెంటనే అకాడమీ యాజమాన్యం ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెను పరిక్షించిన డాక్టర్లు మృతి చెందినట్లు నిర్ధారించినట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిసింది.

వ్యక్తికి తీవ్రగాయాలు

చింతకాని, ఆగస్టు 2: విద్యుదాఘాతంతో మండల పరిధిలోని నామవరం గ్రామానికి చెందిన బొలికొండ భాను అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న భాను శుక్రవారం ఉదయం సమయంలో సర్వీస్ వైరును సరి చేసేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఆ సమయంలో కరెంటు షాక్‌కు గురై స్తంభం పై నుంచి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ స్తంభం ఎక్కిన సంఘటనకు సంబంధించి సంబంధిత వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్ అధికారులు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో కుక్క మృతి

- త్రుటిలో బయటపడిన ఫాగింగ్ సిబ్బంది

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 2: విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో ఫాగింగ్ సిబ్బంది త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడగా శునకం మాత్రం విద్యుత్‌షాక్‌కు గురై సంఘటన ప్రాంతంలోనే కన్నుమూసింది. శుక్రవారం ఉదయం కేఎంసీ ఫాగింగ్ సిబ్బంది నాగేంద్రబాబు 49వ డివిజన్‌లోని వీధుల వెంట ఫాగింగ్ మిషన్‌తో స్ప్రే చేస్తున్నారు. ఇనుప విద్యుత్ స్తంభం వద్దకు ఫాగింగ్ రాగానే సమీపంలోనే ఉన్న అక్కడే ఉన్న కుక్క విద్యుత్ స్తంభం వద్దకు వెళ్లింది, దీంతో ఒక్కసారిగా అధిక వోల్టేజీతో విద్యుత్‌షాక్ జరిగి కుక్క అక్కడికక్కడే మృతిచెందింది. సమీపంలోనే ఉన్న నాగేంద్రబాబు ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురై కిందపడిపోయాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు సంఘటనా ప్రాంతానికి చేరుకొని విద్యుత్ సరఫరా జరిగిన స్తంభం చుట్టూ కంచె వేయించారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఇనుప స్తంభాలను తొలగించాలని కార్పొరేటర్, స్థానికులు డిమాండ్ చేశారు.



కొత్తమారేడుబాకలో పశువులు మృతి

దుమ్ముగూడెం, ఆగస్టు2: విద్యుదాఘాతంతో మండల పరిధిలోని కొత్తమారేడుబాక ఆదివాసీ రైతు తామ కన్నయ్యకు చెందిన ఎద్దు, ఆవు శుక్రవారం మృతి చెందాయి. నరసాపురం గ్రామంలోని పొలంలో మేతమేస్తుండగా, విరిగిపడిన విద్యుత్ స్తంభం వైర్లకు పశువులు తగలడంతో ప్రమాదం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. వీటితోపాటు ఒక దూడ కూడా విద్యుదాఘాతానికి లోనవగా, అది చావుబతుకుల్లో ఉంది. మృతి చెందిన ఆవు, ఎద్దు విలువ సుమారు రూ.లక్ష వరకు బాధితుడు తెలిపాడు. తనను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరాడు.

వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఏడుగురి అరెస్టు

● వివరాలు వెల్లడించిన సీఐ బాలకృష్ణ

ఖమ్మంక్రైం, ఆగస్టు2: ఆటోడ్రైవర్ గుడివాడ సాయి పవన్ పై చాకుతో దాడిచేసిన సంఘటనలో ఏడుగురిని టుటౌన్ పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు. రఘునాథపాలెం మండలం కోయచలకకు చెందిన చింతల వెంకటేశ్వర్లు, నగరానికి చెందిన వంగూరి అరవింద్ కుమార్, బాలసాని ప్రభుదాస్, సోమపొంగు సతీష్, దేవత్ సంతోష్, చల్లా తరుణ్, జేన్‌వాన్ దుర్గాప్రసాద్‌లు ఆటోను అడ్డాలోకి తీసుకు వచ్చినందుకు చాకుతో గుడివాడ సాయి పవన్, గుమ్మడి రమేష్ అనే ఆటోడ్రైవర్లపై దాడిచేసిన విషయం విధితమే. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చట్టవ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప రాత్రి 10 గంటల తరువాత అనవసనంగా రోడ్లపై తిరిగి యువత ప్రమాదాల భారీన పడవద్దని సీఐ బాలకృష్ణ, ఎస్ఐ సూరజ్‌లు తెలిపారు. కాగా తీవ్రంగా గాయపడిన సాయి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

బెల్టు షాపు నిర్వాహకురాలిపై కేసు నమోదు

పాల్వంచ, ఆగస్టు 2: బెల్టు షాపు నిర్వాహకురాలిపై పాల్వంచ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పాల్వంచ పట్టణ పరిధిలోని బొల్లోరిగూడెంలోని కేటీపీఎస్ రోడ్‌లో బెల్టుషాపు నిర్వహిస్తున్న సదరు మహిళ సమయ పాలన లేకుండా 24 గంటలు మద్యం అమ్ముతుండటంపై, ఆమెపై కేసు నమోదు చేసినట్లు టౌన్ అడిషనల్ ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

రౌడీషీటర్ల పేరు చెప్పి దుస్తులు లాక్కెళ్లిన యువకులు

ఖమ్మంక్రైం, ఆగస్టు2: రౌడీషీటర్ల పేరు చెప్పి ఓ వస్త్రదుకాణంలో దుస్తులు దౌర్జన్యంగా లాక్కెళ్లిన సంఘటన ఖమ్మం నగరంలో జరిగింది. బాధితులు తెలిపిన కథనం ప్రకారం. మయూరిసెంటర్‌లో నిర్వహిస్తున్న ఓ వస్త్రదుకాణంలో శుక్రవారం సాయంత్రం ఇద్దరు యువకులు వచ్చారు. ముందు వారికి సరిపోయే సైజుల్లో చొక్కాలు, ప్యాంట్లు ఎంపిక చేసుకొని తీసుకున్నారు. షాపులో ఉన్న యువకుడు రూ.3,500 డబ్బులు చెల్లించమని అడగ్గా, మేము ఫలానా రౌడీషీటర్ల తాలూకా తేడా వస్తే సంగతి చూస్తాం అంటూ రౌడీషీటర్ల పేరు చెప్పి మొదట బెదిరించారు. ఏదైనా ఉంటే మా యజమానితో మాట్లాడాలని తెలపగా, అతడిపై ఇద్దరు యువకులు దాడి చేసి దుస్తులు తీసుకొని వెళ్లిపోయారు. ఈవిషయం షాపు యజమానికి వర్కర్ చెప్పడంతో, సదరు యజమాని దుకాణం వద్దకు వచ్చి అక్కడున్న సీసీ కెమెరాను పరిశీలించారు. వీరు గతంలో కూడా అదే ఇద్దరు రౌడీషీటర్ల పేరు చెప్పి దుస్తులు తీసుకెళ్లారని గుర్తించి టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫిర్యాదు అందుకున్న పోలీసులు సీసీ కెమెరా రికార్డును పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

గోదావరి నీటిమట్టం 34.5 అడుగులు

భద్రాచలం, ఆగస్టు 2: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమ క్రమంగా మరింత తగ్గుముఖం పడుతోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు 39 అడుగులకు తగ్గగా, శుక్రవారం ఉదయం 6 గంటలకు 36.8 అడుగులు, 12 గంటలకు 35.6 అడుగులు, సాయంత్రం 6 గంటలకు 34.5 అడుగులకు తగ్గింది. రాబోయే 24 గంటల్లో గోదావరి నీటిమట్టం మరింతగా తగ్గే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం వ్యాన్

సత్తుపల్లిరూరల్, ఆగస్టు2: అశ్వారావుపేట వైపు నుంచి ఖమ్మం వెళ్తున్న డీసీఎం వ్యాన్, జ్యోతినిలయం సమీపంలో రోడ్డుపై అకారణంగా నిలిపి ఉంచిన లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

గ్యాస్ సిలిండర్ పేలి వృద్ధ దంపతులకు గాయాలు

చంద్రుగొండ, ఆగస్టు 3: గ్యాస్ సిలిండర్ పేలి వృద్ధ దంపతులకు గాయాలైన ఘటన శుక్రవారం మండలంలోని మద్దుకూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బూరుగు వెంకటనర్సమ్మ, భర్త నరసింహ బయట నుంచి వచ్చి తలుపులు తీశారు. ఈ క్రమంలో భార్య వెంకటనర్సమ్మ టీ కాచేందుకు అగ్గిపుల్లతో స్టవ్ వెలిగించబోయింది. ఈ సమయంలో ఒక్క సారిగా మంటలు వ్యాపించడంతో దంపతులు బయటకు పరుగులు తీశారు. కాగా పెద్దశబ్ధంతో సిలిండర్ పేలి ఇంటి కిటికీలు, తలుపులు పగిలిపోయాయి. ఈ ప్రమాదంలో గాయపడిన దంపతులను స్థానికులు కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రామాలయంలో హుండీ చోరీ

సత్తుపల్లిరూరల్, ఆగస్టు2: పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ రామాలయంలో హుండీ చోరీకి గురైనట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. యథావిధిగా పూజా కార్యక్రమాల నిమిత్తం ఆలయాన్ని తెరిచి చూడగా అప్పటికే హుండీ చోరీ జరిగిందని గుర్తించి, పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు.



ఏపీజీవీబీలో తీరిన సిగ్నల్ సమస్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కరకగూడెం ఏపీజీవీబీ

కరకగూడెం, ఆగస్టు 2: మండల కేంద్రంలోని ఏపీజీవీబీలోని ఎస్‌బీఐ ఆర్‌ఆర్‌బీ సాంకేతిక సమస్యలతో పలు రోజలుగా సిగ్నల్స్ రాక పోవడంతో మండలంలో యూపీఐ, ఏటీఎం సిగ్నల్స్ పనిచేయక పోవడంతో నో సిగ్నల్.. ఏపీజీవీబీలో వారం నుంచి సాంకేతిక సమస్య అనే కథనం ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురించడంతో స్పందించి ఉన్నత స్థాయి అధికారులు శుక్రవారం సాంకేతిక సమస్యలను పరిష్కరించి సిగ్నల్స్‌ను పునరుద్ధరించారు. దాంతో శుక్రవారం నుంచి ఖాతాదారులకు యూపీఐ. ఏటీఎం, బ్యాంక్ మిత్రల సేవలు పనిచేశాయి. దాంతో మండలంలోని వినియోగదారులు, వృద్ధుల సమస్యలు తీరాయి. ఆంధ్రజ్యోతి కథనంతో పలు రోజులుగా ఉన్న సిగ్నల్స్ సమస్య తీరిందని పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

దేవస్థానం ఉద్యోగి సస్పెన్షన్

భద్రాచలం, ఆగస్టు 2:: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పని చేసే ఉద్యోగి రాంరెడ్డిని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి సస్పెండ్ చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేవస్థానంలో వివిధ కార్యక్రమాల కోసం తీసుకున్న అడ్వాన్సులకు యూసీలు సమర్పించకపోవడం, చేయాల్సిన చెల్లింపులు చేయలేదనే దేవస్థానం వర్గాల్లో ప్రచారం ఉంది. కాగా నెల రోజులుగా ఆయన ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు అవుతుండటంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది. ఇటీవల సదరు ఉద్యోగిని సస్పెండ్ చేసినా దేవస్థానం వర్గాలు ఈ విషయాన్ని బహిర్గతం చేయకపోవడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

గోదావరి ఒడ్డున గుర్తు తెలియని మృతదేహం

దుమ్ముగూడెం ఆగస్టు 2: దుమ్ముగూడెం గోదావరి నది ఒడ్డున హైడల్ పవర్ ప్లాంటు ఎగువ భాగం ముత్యాలమ్మ చెట్టు సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు కొందరు శుక్రవారం గుర్తించారు. ఇటీవల వచ్చిన వరదలకు ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకొని వచ్చి ఉంటుందని వారు భావిస్తున్నారు. విషయమై వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఈనెల 1న రాత్రి మృతదేహం ఒడ్డుకు చేరి ఉంటుందని చర్చించుకుంటున్నారు.

సీపీఐ సీనియర్ నేత మల్లయ్య మృతి

మణుగూరు రూరల్, ఆగస్టు 2: మండల సాంబాయిగూడె గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నేత దంసలపురి మల్లయ్య(55) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ నేత బి అయోధ్య మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ పినపాక డివిజన్ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, మండల నాయకులు జంగం మోహన్‌రావు, సుధాకర్, కామిశెట్టి రామారావు, బాడిస సతీష్, ఎడారి రమేష్, నోముల రవి, వంగా పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధుడు కన్నుమూత

జూలూరుపాడు, ఆగస్టు 2: జూలూరుపాడు గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు సిరిపురపు నారయణ (89) గుండెపోటుతో శుక్రవారం తెల్లవారుజామున తన స్వగృహంలో మృతిచెందాడు. ఆయనకు భార్య నరసమ్మ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతదేహాన్ని బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ సీపీఐ, నాయకులు నివాళులర్పించారు.

నడి రోడ్డుపై ద్విచక్ర వాహనం దగ్ధం

జూలూరుపాడు, ఆగస్టు 2: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో నడిరోడ్డుపై ద్విచక్ర వాహనం(స్కూటీ) దగ్ధమైన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామంలోని ఇద్దరు ట్రాక్టర్ యజమానుల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే ద్విచక్ర వాహనాన్ని ఓ వర్గానికి చెందిన వ్యక్తి కాలబెట్టినట్లు తెలిసింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా రోడ్డుపై ద్విచక్ర వాహనాన్ని దగ్ధం చేసిన సమాచారం తమకు అందలేదని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ నిలుపుదల చేయాలి

జూలూరుపాడు, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిలిపి వేయాలని కోరుతూ శుక్రవారం మాల మహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ స్వాతిబిందుకు నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు బుడిపుడి ప్రభాకర్ మాట్లాడుతూ రాజకీయ లబ్ధికోసం పాలకులు వర్గీకరణను తెరమీదకు తెచ్చారని దీనిని వెంటనే నిలుపుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లంగి తిరపతి, పోతురాజు రామరావు, ఆనందరావు, బాలకృష్ణ, దినేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తత అవసరం: ఎస్ఐ

మణుగూరు, ఆగస్టు 2: ప్రజా రక్షణ, శాంతి భద్రతల్లో పనిచేసే ప్రతి కానిస్టేబుల్‌కు విధుల్లో అప్రమత్తత ఎంతో అవసరమని మణుగూరు ఎస్ఐ మేడ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మణుగూరు పోలీసు స్టేషనల్‌లో నిర్వహించి పోలీసు డ్రిల్ కార్యక్రమాన్ని ఎస్ఐ పర్యవేక్షించారు. సిబ్బందితో మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తూ.కేసులను చేధించడంలో అనుసరించాల్సిన వ్యూహాలను తెలిపారు ఎస్ఐ రంజిత్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

దుమ్ముగూడెం ఆగస్టు 2:మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో ముత్యాలరావు తెలిపారు. సభ్యులంతా ఉదయం పదకొండు గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో హాజరు కావాలని కోరారు. కాగా ప్రస్తుత పాలకవర్గానికి ఇది చివరి సమావేశం కానుంది.

విద్యుత్ ట్రాన్‌ఫార్మర్లలో కాఫర్ వైరు చోరీ

జూలూరుపాడు, ఆగస్టు 2: మండలంలోని పాపకొల్లు, కరివారిగూడెం గ్రామాలలోని వ్యవసాయ ట్రాన్స్ ఫార్మర్లలో కాపర్ వైరు చోరీకి గురైనట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీష్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ మోటర్లు పనిచేయకపోవటం తో రైతులు సమాచారం అందించటంతో విద్యుత్ సిబ్బంది ట్రాన్స్ ఫార్మర్లను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్ ఫార్మర్లను పగలగొట్టి కాపర్ వైర్లను చోరీ చేసినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

సమన్వయంతో పనిచేయకుంటే చర్యలు తప్పవు

» ఊటపల్లి అంగన్‌వాడీ కేంద్రం వివాదంపై డీడబ్ల్యూవో విజేత విచారణ » పదిరోజులుగా కేంద్రం మూసివేతపై ఆగ్రహం

అశ్వారావుపేట టౌన్ , ఆగస్టు 2: సమన్వయంతో పనిచేసి చిన్నారులకు గర్భవతులకు , బాలింతలకు సేవలందించాల్సిన అంగన్‌వాడీ సిబ్బంది వివాదాలు పెట్టుకొని కేంద్రాన్ని మూసివేయటంపై డీడబ్ల్యూవో విజేత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊట్లపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం గత పదిరోజులుగా మూతవేసి వుంది. ఇక్కడ పనిచేస్తున్న టీచర్, ఆయాల మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో ఉపాధ్యాయురాలు సెలవుపై వెళ్లడం, ఆయా వేరే కేంద్రానికి డిప్యూటేషన్‌పై వెళ్ళడంతో కేంద్రం మూతపడింది. ఈవిషయం తెలుసుకున్న డిడబ్ల్యూవో విజేత శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి జరిగిన పరిణామాలపై విచారణ నిర్వహించి సంబంధిత అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు పరిశీలిస్తే ఊట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ కేదారేశ్వరి, ఆయా రాములమ్మ మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతుంది. ఈనేపథ్యంలో సీడీపీవో రోజారాణి ఆయాను వేరే కేంద్రానికి డిప్యూటేషన్‌పై పంపారు. ఇదే తరుణంలో కేంద్రం నిర్వహణపై ఫిర్యాదులు వచ్చాయంటూ గత నెల 22న సీడీపీవో టీచర్‌ను, ఆయాను కార్యాలయానికి పిలిపించి మందలించారు. అనంతరం ఇంటికి వెళ్ళిన టీచర్ కేదారేశ్వరి అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరటంతో సెలవుపెట్టారు.


విచారణ జరుపుతున్న డిడబ్ల్యూవో విజేత

దీంతో 10రోజులుగా కేంద్రం మూతపడింది. ఫలితంగా విద్యార్థులు పోషకాహారానికి, విద్యకు దూరమయ్యారు. ఈవిషయం తెలుసుకున్న డిడబ్ల్యూవో కేంద్రానికి వచ్చి విచారణ జరిపారు. వివాదాలు పెట్టుకొని కేంద్రం మూసివేయటంపై మీరేమి చేస్తున్నారని సీడీపీవో రోజారాణి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మా ట్లాడుతు జరిగిన సంఘటనపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తున్నామని నలుగురికి షోకాజ్‌నోటీసులు జారీచేస్తామని తెలిపారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అం గన్ వాడీ కేంద్రాలలో బాధ్యతలు విస్మరిస్తే చర్యలు తప్పవన్నారు.

సర్వజన ఆసుపత్రి సమస్యలు పరిష్కరించాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య » కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేత

కొత్తగూడెం, అగస్టు 2: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సీపీఎం సర్వేలో వెల్లడైన సమస్యలను శుక్రవారం కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ సమస్యలను నిలయంగా ప్రభుత్వ ఆసుపత్రి ఉందన్నారు. సీపీఎం నిర్వహించిన సర్వేలో అనేక సమస్యలు సర్వే బృందం దృష్టికి వచ్చాయన్నారు. మూడు నెలల నుంచి ఆసుపత్రికి మందుల సరఫరా లేదని ప్రైవేటు మందుల షాపులను ఆశ్రయించి సొంత డబ్బులతో కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.డాక్టర్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. డయాలసిస్ బెడ్ల సంఖ్యను పెంచాలని, ఆసుపత్రి ఆవరణలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, మందులు అందుబాటులో ఉంచాలని తక్షణమే ఆసుపత్రిలోని అన్ని సమస్యలను పరిష్కరించి సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడాలని అన్నారు.

పునరావాస కేంద్రాన్ని కొనసాగించాలి...

నలభై ఏళ్ల క్రిందట నిర్మించిన పాత కొత్తగూడెం ఎస్సీ కాలనీ ఇళ్ళు వర్షాకాలం వస్తే నివసించడానికి వీలు ఉండదని, వర్షాకాలం అక్కడి ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఈ క్రమంలోనే ప్రతి సంవత్సరం అక్కడ ప్రజలను పాత కొత్తగూడెం తెలంగాణ స్కూల్‌లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి అందులో ఉంచుతున్నారని అన్నారు. కానీ ఈ సంవత్సరం కూడా కాలనీ వాసులను పునరావాస కేంద్రంలో ఉంచిన అధికారులు పూర్తి స్థాయిలో వర్షాలు తగ్గక ముందే వారిని వారి ఇళ్ళకు పంపించివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పూర్తిగా తగ్గేవరకు వారిని పునరావాస కేంద్రంలో కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలరాజు, అన్నవరపు సత్యనారయణ, భూక్యా రమేష్, వీరన్న, లక్ష్మి, నందిపాటి రమేష్, కాలంగి హరికృష్ణ, మంద నాగకృష్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

న్యాయవాది సురేష్‌బాబుకు కన్నీటి వీడ్కోలు..


నివాళులర్పిస్తున్న జిల్లా న్యాయాధికారి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 2: కొత్తగూడెంలో న్యాయవాది వాసిరెడ్డి సురేష్‌బాబుకు శుక్రవారం కన్నీటి వీడ్కోలు పలికారు. న్యాయవాది సురేష్‌బాబు పార్థీవ దేహనికి సీపీఐ సీనియర్ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు పూలమాల వేసి ఘన నివాళ్ళు అర్పించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సానుభూతిని సురేష్‌బాబు మృతి పట్ల సంతాపాన్ని ప్రకటించారు. నివాళ్ళు అర్పించిన వారిలో జిల్లా ప్రధాన న్యాయాధికారి వసంత్‌పాటిల్, సీనియర్ సివిల్ జడ్జీ జి.భానుమతి, జూనియర్ సివిల్ జడ్జీలు సాయిశ్రీశివనాయక్, జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్తగూడెం బార్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, ప్రముఖులు తూమ చౌదరి, తుళ్ళూరి బ్రహ్మయ్య, తాళ్ళూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ రామనాధం, బిక్కసాని నాగేశ్వరరావు, కోనేరు చిన్నీ, జేవికె మనోహన్, కనగాల అనంతరాములు, రమేష్, మక్బుడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, జిల్లా నాయకులు వాసిరెడ్డి మురళీప్రసాద్, కంచర్ల జమలయ్య, మాచర్ల శ్రీనివాస్, భాగం మాధవరావు, ఎస్‌కె.యూసఫ్, బోయిన విజయ్‌కుమార్, నేరెళ్ళ రమేష్, దాసరి శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, ప్రముకులు లగడపాటి రమేష్, ఎడవల్లి కృష్ణ తదితరులు ఉన్నారు.

ఎస్టీ వర్గీకరణ చేపట్టాలి: చందా లింగయ్య

భద్రాచలం, ఆగస్టు 2: రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణతో పాటు ఎస్టీల వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు జాతీయ ఆదివాసీ సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షులు చందాలింగయ్యదొర అన్నారు. భద్రాచలంలో శుక్రవారం జరిగిన ఆదివాసీ సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎస్టీ వర్గీకరణ కోసం నివేదికను స్వయంగా అందజేశామన్నారు. గిరిజనుల వర్గీకరణ బిల్లును చేసి త్వరలో చట్టం చేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో అప్పుడు మంత్రిగా ఉన్న జగన్నాయక్ ఎస్టీ వర్గీకరణ బిల్లును నిలిపివేశారన్నారు. 1994 నుంచి జరగవలసిన ఎస్టీ వర్గీకరణ ఇప్పటి వరకు జరగకపోవడం ఆదివాసీలకు తీరని నష్టం చేకూర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పహణి ఆధారంగా రుణమాఫీ చేయలని ధర్నా

ఆళ్లపల్లి, ఆగస్టు 2: రైతులకు రుణమాఫీ పహణి ఆధారంగా వర్తింపజేయాలని కోరుతు శుక్రవారం ఆళ్లపల్లి మండల రైతులు, ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి, వైస్‌ఎంపీపీ రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎంపీపీ మంజుభార్గవి, వైఎస్‌ఎంపీపీ రేసు ఎల్లయ్య మాట్లాడుతూ..మండలంలోని గిరిజన, గిరిజనేతరులకు గత ప్రభుత్వాల హాయంలో పహణి ఆదారంగా రుణాలు ఇచ్చారని అధికారుల తప్పిదంతో రైతులకు పట్టాలు కాలేదన్నారు. తహసీల్ధార్‌కు వినతిపత్రం అందజేశారు. రేసు వెంకన్న, కో-ఆప్షన్ సభ్యులు రహీం, బాబు, పగడయ్య సతీష్, రైతులు పాల్గొన్నారు.

పేదలకు సహాయం చేయడంలోనే ఆనందం: ఎస్ఐ

కరకగూడెం, అగస్టు 2: సమాజంలో నిరుపేదలకు సహాయం చేయడంలోనే ఆనందం కలుగుతుందని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ తెలిపారు. శక్రవారం ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్ సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో పద్మాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, డ్రాయింగ్ కిట్స్‌లను ఎస్ఐ రాజేందర్ 60 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఏజెన్సీ గ్రామాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అందిస్తున్న సేవలను సంస్థ సభ్యులు సోందుపాషాను అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ ఈసం అనురాధ, స్వర్ణలత, సుజాత, ఫౌండేషన్ సభ్యులు సోందుపాషా, ఫారుక్, గ్రామస్థులు పఠాన్ యాకుబ్ ఖాన్, ఈసం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నూతన జిల్లా కమిటీ నియామకం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 2: బీఎస్పీ జిల్లా కమిటీ నియామకం చేసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ శుక్రవారం కొత్తగూడెంలో ప్రకటించారు. పార్టీ జిల్లా సమీక్ష సమావేశం జిల్లా అధ్యక్షుడు గంధం మల్లిఖార్జునరావు అధ్యక్షతన హెడ్ ఆఫీస్ వద్ద గల ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయం నందు ముఖ్య అతిథిగా హాజరై నియమితులైన వారికి నియామక పత్రాలను అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కాంపాటి నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరునాయక్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పాక వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గద్దల రవి, జిల్లా కోశాధికారి పీక మల్లిఖార్జున్‌రావు, జిల్లా బవీఎఫ్ కన్వీనర్ కాళ్ళ రంజిత్‌లు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అశ్వారావుపేట, ఆగస్టు 2: పామాయిల్ ప్యాక్టరిలో జరిగిన ప్రమాదంలో చేయిని కోల్పోయిన తగరం వెంకటేశ్వరరావు కుటుంబాన్ని అశ్వారావుపేట కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. పామాయిల్ ప్యాక్టరీలో క్రషింగ్ మిషన్ వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్‌లో చేయిపడి నుజ్జు నుజ్జు కావటంతో చేతిని తొలగించారు. వెంకటేశ్వరావును పరామర్శించిన వారిలో జూపల్లి రమేష్, ప్రమోద్, ఎంపీటీసీ మిండా హరిబాబు, నండ్రు రమేష్, సూరానేని బాబ్జి, నార్లపాటి దివాకర్, బుచ్చిబాబు, తగరం ముత్తయ్య, ప్రవీణ్, శ్రీను, హేమంత్, నాగు, పణి, బాబీ తదితరులు వున్నారు.

ఏకలవ్యను సందర్శించిన ఆర్సీవో

దుమ్ముగూడెం ఆగస్టు 2: లక్ష్మీనగరంలో నిర్వహిస్తున్న సీతారాంపురం తెలంగాణా రాష్ట్ర ఏకలవ్య మోడల్ పాఠశాలను గురుకులం ఆర్సీవో నాగార్జునరావు శుక్రవారం సందర్శించారు. స్టాఫ్ మీటింగ్‌ను నిర్వహించారు. వార్డెన్‌పై 11వ తరగతి విద్యార్థులు దాడిచేసిన సంఘటనకు దారితీసిన పరిస్థితులను సమీక్షించారు. విద్యార్థుల మనస్తత్వాన్ని గుర్తించి అవసరమైన క్రమశిక్షణ నేర్పాలని సూచించారు. మెరుగైన భోజన వసతి కల్పించడంతో పాటు చదువు, క్రీడల్లో ముందుండేలా విద్యార్థుల్ని ప్రోత్సహించాలని తెలిపారు. సిబ్బంది అంతా కలిసి పనిచేసి పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. దాడి సంఘటనకు బయపడిన సిబ్బంది తాను వార్డెన్ విధులు నిర్వహించలేనని తెలపడంతో ప్రిన్సిపాల్ ఆదేశాలు పాటించాల్సిందేనని ఆర్సీఓ అన్నారు. ఎఫ్ఏసీ ప్రిన్సిపల్ సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి రెండు రోజులు తాగునీటి సరఫరా నిలిపివేత

భద్రాచలం, ఆగస్టు 2: భద్రాచలం పట్టణంలో శని, ఆదివారాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మిషన్ భగీరథ ఉప కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ తెలిపారు. గోదావరి వరదల కారణంగా నీటిలో మురికి హెచ్చుస్థాయిలో ఉండటం వలన పాండవులగుట్ట ప్లాక్యులేటర్, ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మత్తులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 5వ తేదీ నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

పని ప్రదేశాలలో సౌకర్యాలను కల్పించాలి

కొత్తగూడెం, ఆగస్టు 2: పని ప్రదేశాలలో కార్మికులకు సౌకర్యాలను కల్పించాలని, పనికి తగిన మ్యాన్‌పవర్ ఇవ్వాలని, కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని వినతి పత్రాన్ని అందజేశారు. శుక్రవారం పీవీకే 5వగనిలో ఐఎన్‌టీయూసీ గేట్ మీటింగ్ పిట్ కార్యదర్శి రాజయ్య ఆధ్వర్యంలో ఏరియా వైస్‌ప్రెసిడెంట్ ఎండి రజాక్ అధ్యక్షతన జరిగింది. ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ నాయకులు రాజేశ్వరరావు, సైమన్, అశోక్, బ్రాంచ్ సెక్రటరీలు నవీన్, బాలు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ. 51వేలు అందజేత

కొత్తగూడెం కల్చరల్, ఆగస్టు 2: పట్టణంలోని పాండురంగ భజన మందిరం అభివృద్ధికి ఓ దంపతులు శుక్రవారం ఆర్థిక సహాయం అందించారు. వాసవిక్లబ్ అంతర్జాతీయ సమన్వయ కర్త పల్లపోతు శ్రీనివాస్-కవితాలక్ష్మీ దంపతులు ఆలయానికి రూ. 51 వేల నగదును పూజారి రమణచార్యులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కూతురు లక్ష్మీశరణ్య పుట్టిన రోజు నాడు ఆలయ అభివృద్ధికి వితరణ అందించడం ఆనందంగా ఉందన్నారు.

ఏటీఎంలో పాము కలకలం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగష్టు02: ఏటిఎం మిషన్‌లో పాము కలకలం రేపింది. శుక్రవారం కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ ప్రాంతంలో ఉన్న ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంక్(ఐవోబి) ఏటిఎం మిషన్‌లో క్యాష్‌ను లోడ్ చేసేందుకు బ్యాంకు ఉద్యోగి మూర్తి వెళ్ళాడు. ఈ క్రమంలో మిషన్‌ను ఓపెన్ చేయగా ఆమె మిషన్‌లో పాము పిల్ల దర్శనమిచ్చింది. దీంతో స్నేక్ క్యాచర్ మహేష్‌కు సమాచారం అందించగా ఏటిఎం వద్దకు చేరుకొని ఆ పాము పిల్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో నగదును విత్‌డ్రా చేసేందుకు ఏటిఎంకు వచ్చిన ఖాతాదారులు భయాందోళన చెందారు.

పోస్టల్ శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోండి

చండ్రుగొండ, అగస్టు 2: తపాలశాఖ ఆధ్వర్యంలో ప్రవేశ పెట్టిన పలు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆశాఖ అసిస్టెంట్ సూపరింటెండెట్ రజిత్ కుమార్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని రావికంపాడు పంచాయితీ కార్యాలయంలో పథకాలపై అవగాహన కల్పించేందుకు మహిళలతో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రజిత్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంక్‌లతో సమానంగా తపాలశాఖ పలు రకాల సేవలను అందిస్తుందన్నారు. ప్రతి మహిళ తమ కుటుంబంకోసం పొదుపు చేయాలని, అందుకు ప్రతి గ్రామంలో అందుబాటులో ఉండే పోస్ట్ ఆఫీస్‌ను ఎంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెయిల్ వోర్సిల్ల సత్యనారాయణ, రాజేందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విధులు సమర్ధవంతంగా నిర్వహించాలి

జూలూరుపాడు, ఆగస్టు 2: అటవీ సిబ్బంది విధులను సమర్ధవంతంగా నిర్వహిస్తూ ప్రజల మన్ననలను చూరగొనాలని కొత్తగూడెం ఎఫ్‌డీవో యు. కోటేశ్వరరావు తెలిపారు. జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలో డీఆర్‌ఓగా విధులు నిర్వహించిన లక్ష్మీనర్సు, ఎఫ్‌బిఓలు జే. కిషన్, బి. రవిలు బదిలీ అయ్యారు. దీంతో శుక్రవారం స్థానిక అటవీ శాఖ కార్యలయంలో వారికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఫ్‌డీఓ వారికి మెమెంటోలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ సిబ్బంది ఉత్తమ సేవలను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాదరావు, సిబ్బంది మల్లయ్య, సలీమ్, కిషన్, రహీమ్, విజయలక్ష్మీ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ పోస్టర్ల ఆవిష్కరణ

భద్రాచలం, ఆగస్టు 2: యువత మత్తు, గంజాయి పదార్థాలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను శుక్రవారం భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆవిష్కరించారు.

నేడు మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య 4వ వర్ధంతి


రాజయ్య (ఫైల్)

భద్రాచలం, ఆగస్టు 2: భద్రాచలం శాసన సభ్యులుగా మూడు సార్లు బాధ్యతలు నిర్వహించిన దివంగత సీపీఎం నేత సున్నం రాజయ్య 4వ వర్ధంతి శనివారం నిర్వహించనున్నారు. భద్రాచలంలో సీపీఎం కార్యాలయం నుంచి రాజయ్యస్థూపం వద్దకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య రాష్ట్ర, కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, డీసీసీబీ మాజీ చైర్మన్ యలమంచి రవికుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి తదితరులు పాల్గొననున్నారు.

ఎమ్మెల్యేగా మూడుసార్లు

సున్నం రాజయ్య సీపీఎం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా మూడుసార్లు ఎన్నికైనా ఆయనకు సీఎంలు, మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు ఎవరినైనా ఆప్యాయంగా పలకరించే వారు. అంతటి మహనీయుడు మృతి చెంది నాలుగేళ్లు గడిచినా నేటికి ఆయనను ఇంకా భద్రాచలం నియోజకవర్గవాసులు స్మరించుకుంటూ ఉండటం విశేషం. భద్రాచలం ఎమ్మెల్యేగా సున్నం రాజయ్య మూడుసార్లు గెలుపొందారు. తొలిసారిగా 1999లో భద్రాచలం ఎమ్మెల్యేగా గెలుపొందగా 2004, 2014లో ఆయన విజయం సాధించారు. 2009లో భద్రాచలం నుంచి, 2019లో మరోసారి ఏపీలోని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

నాణ్యత లేని జేవీఆర్‌సీహెచ్‌సీ నిర్మాణంపై విచారణ జరిపించాలి

కొత్తగూడెం, ఆగస్టు 2: సమతా కంపెనీ నాణ్యత లేని నిర్మాణాలను చేపట్టి కోట్లాది రూపాయలను మింగిందని, కనీసం రెండేళ్లు కూడా కాకముందే నిర్మాణాలలో పగుళ్ళు ఏర్పడి కూలడానికి సిద్ధంగా ఉన్నాయని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్‌లు ఆరోపించారు. శుక్రవారం వారు సత్తుపల్లి జేవిఆర్‌హెచ్‌సి ప్లాంట్‌ను సందర్శించారు. వారు మాట్లాడుతూ రూ.400 కోట్ల బడ్జెట్‌తో కోల్ ట్రాన్స్‌పోర్ట్ రవాణా నిమిత్తం నూతనంగా నిర్మించిన కోల్ బంకర్స్ రెండేళ్ళకే పగుళ్ళు ఏర్పడి కుంగిపోయాయన్నారు. నాశిరకంగా పనులను చేపట్టిన కంపెనీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి బ్రాంచ్ నాయకులు క్రాంతికుమార్, నాగా ప్రకాశ్, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, రామారావు, నాగయ్య, నాగేంద్ర, రాజారామ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో వన మహోత్సవం

భద్రాచలం, ఆగస్టు 2: భద్రాచలంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. డిపో మేనేజరు తిరుపతి ఆధ్వర్యంలో భద్రాచలం డిపో ఆవరణలో చెట్లు నాటడం జరిగింది. ఈ సందర్భంగా డీఎం తిరుపతి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చెట్లను నాటడం అలవాటు చేసుకోవాలని చెట్లను నాటడం వలన కాలుష్యాన్ని నివారించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరు చక్రవర్తి వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కరకగూడెం, ఆగస్టు 2: మండల ప్రజలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే రోగల బారినుంచి తప్పించుకోవచ్చని కరకగూడెం వైద్యాధికారి కారం మధు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని భట్టుపల్లి పంచాయితీలో వైద్య శిబిరంను వైద్యాధికారి మధు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కుమార్, హెచ్ఈవో పోలెబోయిన క్రిష్ణయ్య, ఏఎన్ఎంలు రుక్మిణి, జ్యోతి, హెచ్ఏ క్రిష్ణ, నరసింహారావు, ఆశ వర్కర్లు పుష్ప, సుగుణ, మాణిక్యం, ఉమామహేశ్వరి, ప్రభావతి, రమాదేవి పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి రైతుల సమస్యలు

కొత్తగూడెం, అగస్టు 2: కొత్తగూడెం నియోజకవర్గంలోని నరసింహసాగర్, రేగళ్ళతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను టీపీసీసీ సభ్యులు నాగసీతారాములు శుక్రవారం కలెక్టర్ జితేష్ వీ. పాటిల్ దృష్టికి తీసుకెళ్ళారు.ఆయా గ్రామాల్లోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రైతుల సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవలని కోరారు. నేటికీ కొందరు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందలేదని, అటువంటి వారికి పాసుపుస్తకాలను అందించి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వారికి అందేలా చూడాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే పరిష్కారం చూపుతామని తెలిపారు.

ముర్రుపాలే శిశువుకు ఆరోగ్యం

మణుగూరు, ఆగస్టు 2 : మణుగూరు పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో జయలక్ష్మి ముఖ్య అతిధిగా హాజరై ఆసుపత్రిలో ఉన్న బాలింతలను పరామర్శించారు. ముర్రుపాలు పుట్టిన శిశువుకు బలవర్ధకమైన పోషనను అందిస్తాయని తెలిపారు. పుట్టిన ప్రతిశిశువుకు తల్లులు ముర్రుపాలు పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జీ సుశీల, జే హైమావతి, మణుగూరు సమితి సింగారం సెక్టర్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

● టేకులపల్లిలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో టేకులపల్లి, బొమ్మనపల్లి సూపర్ వైజర్లు అనురాధ, యశోదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

● అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు అంగన్‌వాడీ కేంద్రం-1 లో అంగన్‌వాడీ టీచర్స్‌వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెడ్డి అరుణ,స్థానిక టీచర్ ఇరానీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

అశ్వారావుపేట: గుమ్మడివల్లి-2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు కేటాయించాలి

● వరద బాధితుల ఆందోళన

భద్రాచలం, ఆగస్టు 2: భద్రాచలంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీ వాసులు శుక్రవారం తమకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రహదారిపై ఆందోళన చేశారు. ఇటీవల వచ్చిన వరదలతో తమ కాలనీ ముంపునకు గురైందని ప్రతీ ఏడాది ఈ సమస్య తప్పడంలేదని వారు వాపోయారు.తమకు వెంటనే ఇళ్లు కేటాయించాలని డిమాండ్‌చేశారు. దీంతో పోలీసులు కల్పించుకొని రహదారిపై బైటాయించవద్దని ఇళ్లకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయాలని సూచించారు.

విద్యుత్ మోటర్ల దగ్గర రైతులు జాగ్రత్తలు పాటించాలి

● గుండాల మండలంలో పర్యటించిన విద్యుత్ శాఖ ఎస్ఈ బీకంసింగ్

గుండాల, ఆగస్టు 2: రైతులకు విద్యుత్ సమస్యలు పరిష్కారించాలన్న ఉద్దేశ్యంతో శుక్రవారం గుండాల మండలం, ముత్తాపురం గ్రామంలో విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ, బీకంసింగ్, డీఈ నందయ్య, ఏడీ కోటేశ్వరావు ఏఈ రమేష్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ- రైతు పోలంబాట అనే కార్యాక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. వర్షకాలంలో మోటర్ల దగ్గర కేపాజిటర్లు, ఆటో స్టార్టర్ల వాడకం, విద్యుత్ ప్రమాదాలు ఎలా నివారించాలని, మోటర్ ఆన్ చేస్తున్న క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైలుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు రవి, రాము, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీతారాంపురంలో పొలంబాట

దుమ్ముగూడెం: మండల విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాంపురంలో పొలంబాట నిర్వహించారు. ఒరిగిన విద్యుత్ స్తంబాలను నిలబెట్టడం, లూజు వైర్లను సరిచేయడం, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద పొదలను తొలగించారు. ఆటోస్టార్టర్లను తొలగించి కెపాసిటర్లను అమర్చుకోవాలని సూచించారు. ఏఈ మోహన్‌రెడ్డి, సిబ్బంది వెంకటేశ్వర్లు, రాంచందర్, రైతులు అన్నె సత్యనారాయణమూర్తి, కొడాలి లోకేష్‌బాబు, బొల్లోజు రవికుమార్, కొల్లి గోవిందరావు, శ్రీనివాసరావు, మల్లిఖార్జునరావు, వెంకటకృష్ణ, కాంతారావు, అనీల్, సురేంద్రలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు పట్ల హర్షం..

మణుగూరుటౌన్, ఆగస్టు 2 : సుప్రీం కోర్టులో ఎస్సీ వరీకరణకు అనుకూలంగా వచ్చిన తీర్పుపై ఎంఆర్‌పీఎస్ మణుగూరు మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం టీడీపీ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ఎంఆర్‌పీఎస్ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశామని, ఎన్నో ఏళ్లుగా వర్గీకరణ చట్టబద్ధత కోసం వేచిచూసామన్నారు. వర్గీకరణ ఆమోదంపై హర్షం వ్యక్తం చేసిన నాయకులు మంద కృష్ణ చేసిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పుపై టీడీపీ హర్షం

ఎన్నో ఏళ్లుగా ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మాదిగలు చేస్తు పోరాటాలకు ప్రతిఫలంగా సుప్రీం కోర్టు వర్గీకరణకు సానుకూలంగా తీర్పునివ్వడం పట్ల టీడీపీ నేత వట్టం నారాయణ దొర హర్షం వ్యక్తం చేశారు. 1997 సంవత్సరంలో నాటి ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు కమీషన్ ఏర్పాటు చేసి అన్ని అంశాలపై సమగ్ర నివేధికను తీసుకుని జూన్ 1న వర్గీకరణ చేస్తూ జీఓ జారీ చేశారన్నారు. ఆ తర్వాత పరిణామాల నేపద్యంలో సుప్రీం కోర్టులో కేసు వేయడంతో వర్గీకరణ ఫలితాలు నిలిపివేసారన్నారు. సుదీర్ఘ పోరాటాల అనంతరం సుప్రీం కోర్టు నాటి చంద్రబాబునాయుడు చేసిన జీఓ సరైనదేనని తీర్పునివ్వడం హర్షించదగ్గనీయమన్నారు.

● టేకులపల్లి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో శుక్రవారం టేకులపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు మెంతెన ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎంఆర్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు టేకులపల్లిలో ర్యాలీ నిర్వహించి బోడురోడ్డు సెంటర్‌లో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి చంగల గురునాధం మాదిగ, జినక ఇస్తారి, చింతల మోహన్‌రావు, కుక్కమూడి శంకర్, కండె నాగభూషణం, అర్జునరావు, సంజీవరావు, జగన్, మహిళా నాయకులు గృహలక్ష్మీ, కమల, అన్నపూర్ణ, యూత్‌నాయకులు సతీష్, మహేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మణుగూరులో హర్షం వ్యక్తంచేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

● అశ్వాపురంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఇసంపల్లి కృష్ణ, టిఎంజేఏసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు,కొడారి వెంకటేశ్వర్లు,నాయకులు గద్దల రామకృష్ణ,రమేష్,గోపినాథ్,రామకృష్ణ,లింగయ్య,తదితరులు పాల్గొన్నారు.

● దమ్మపేటలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యద ర్శి కొలికిపోగు కాంతారావు, బీజేపి నాయకుడు కొలలికిపోగు ముసలయ్య, రావూరి వీరయ్య, రాయల పుల్లారావు, రమణ, శివకృష్ణ, దుర్గయ్య, దారా రంగారావు తదితరులు పాల్గొన్నారు.